



# విజయభాను






విశాఖపట్నం, సోమవారం 25-12-2017 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 41 సంచిక : 102 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# అమ్మ వారసుడను నేనే



**మూడు నెలల్లో పళని ప్రభుత్వం పడిపోతుంది**

**ఓట్ల లెక్కింపులో భారీ ఆధిక్యం**

**ఆర్కే ప్రజలకు నా కృతజ్ఞతలు**

**శశికళ అభ్యర్థి దినకరన్**

చెన్నై: తమిళనాడులో అధికార, ప్రతిపక్షాలకు పెద్ద షాక్. మాజీ సీఎం జయలలిత ప్రాతినిధ్యం వహించిన ఆర్కే నగర్‌లో స్వతంత్ర అభ్యర్థి టీటీవీ దినకరన్ బంపర్ మెజార్టీతో ఘన విజయం సాధించారు. అన్నాడీఎంకే అభ్యర్థి మధుసూదనన్‌పై 40707 తరువాయి 2లో

## రాష్ట్రపతి దంపతులకు
# కేసీఆర్ స్వాగతం



హైదరాబాద్: శీతాకాల విడిది నిమిత్తం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆదివారం హైదరాబాద్ చేరుకున్నారు. హకీంపేట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్ ఘనస్వాగతం పలికారు. అనంతరం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి బయలుదేరి వెళ్లారు. రాష్ట్రపతి గౌరవార్థం ఆదివారం రాత్రి గవర్నర్ నరసింహన్ రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విందుకు ఆయన హాజరైనారు. రాష్ట్రపతి నిలయంలో నాలుగు రోజుల విడిది అనంతరం 27న విజయవాడ వెళతారు. హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో కేవలం మూడు రోజులు మాత్రమే విడిదిచేస్తారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో బొల్లారం పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటుచేశారు. ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందాలు తమ అధీనంలోకి తీసుకున్నాయి. మరోవైపు హకీంపేట ఎయిర్‌ఫోర్స్ తరువాయి 2లో

# మోదీజీ.. జీతాలు పెంచండి

## ప్రధానికి ఎయిమ్స్ వైద్యుల లేఖ

జయపుర: జీతాలు పెంచాలంటూ కొద్దిరోజులుగా రాజస్థాన్‌కి చెందిన ప్రభుత్వ వైద్యులు ఆందోళన చేపడుతున్నారు. దీనిపై ఎయిమ్స్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హర్జీత్ సింగ్ ప్రధాని నరేంద్రమోదీకి లేఖ రాశారు.

మీలాంటి ప్రధాని మాకు ఉన్నందుకు మేమెంతో అదృష్టవంతులం. ఓ ప్రభుత్వ వైద్యుడి బాధలు మీకు తెలియాలంటే తెలుపు రంగు ఆప్రాన్ వేసుకుని ఒకరోజు ప్రభుత్వ వైద్యుడిగా వ్యవహరించండి. అప్పుడు మీకు తెలుస్తుంది అత్యవసర పరిస్థితుల్లో రోగుల కుటుంబీకులు మాతో ఎలా ప్రవర్తిస్తారో. ప్రచారం కోసం ఇలాంటి ఆందోళనలు చేస్తున్నామని ఆరోపించే మంత్రులకు కూడా మా బాధలేంటో తెలిసొస్తాయి. మీరు ఒక్కరోజు ప్రభుత్వ వైద్యుడిగా మారితే విద్యావ్యవస్థలో మార్పు, ప్రజలకు నమ్మకం కలుగుతుంది అని లేఖలో పేర్కొన్నారు.

జీతాలు పెంచాలంటూ రాజస్థాన్‌లో వైద్యులు డిసెంబర్ 16 నుంచి ఆందోళన కొనసాగిస్తున్నారు. ఆందోళనలు చేస్తున్న వైద్యులపై ప్రభుత్వం రెస్మా చట్టం ప్రయోగించి 86 మంది వైద్యులను అరెస్టు చేయించిందని లేఖలో పేర్కొన్నారు.



# ప్రపంచ వ్యాప్తంగా క్రిస్మస్ సందడి



న్యూఢిల్లీ: ప్రపంచ వ్యాప్తంగా క్రిస్మస్ సందడి కొనసాగుతోంది. ప్రధాన నగరాలకు పండుగ శోభ వచ్చేసింది. ఇక శాంటాక్లాజ్ హంగామా, క్రిస్మస్ షాపింగ్ హడావుడి మమూలుగా లేదు. ప్రపంచవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు ఎలా ఉన్నాయంటే... పండుగ వేడుకల్లో ప్రజలు తలమునకలయ్యారు. చర్చిలు కొత్త రూపును సంతరించుకున్నాయి. విద్యుత్ దీపాలతో వెలుగులు విరజిమ్ముతున్నాయి. అటు ఆయా దేశాల్లోనూ క్రిస్మస్ హంగామా మొదలైంది.

క్రిస్మస్ షాపింగ్ తప్పనిసరి. అందుకే షాపింగ్ మాల్స్‌కు తాకిడి పెరిగింది. మరీ ముఖ్యంగా క్రిస్మస్ ట్రీ, శాంటాక్లాజ్ క్యాప్స్‌తోపాటు గిఫ్ట్‌లు కొనుగోలు చేస్తున్నారు. కొన్ని చోట్ల నెల రోజుల ముందునుంచే ప్రిపరేషన్స్ మొదలయ్యాయి. క్రిస్మస్‌కు ముందు రోజు రాత్రి శాంటాక్లాజ్ అందరికి బహుమతులు అందజేస్తాడని విశ్వాసం ఉంది. అందుకే చాలా మంది ఈ విషధారణలో పిల్లలకు బహుమతులు అందజేస్తారు. ముఖ్యమంగా బ్రిటన్‌లో శాంటాక్లాజా సందడి మమూలుగా ఉండదు. గుర్రపు బగ్గీపై వచ్చే శాంటా క్లాస్ పిల్లలందరికి బహుములు ఇస్తాడు. అటు బ్రిటన్ ప్రధాని థెరిస్సామే దేశ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

# ట్రిపుల్ తలాక్ బిల్లును వ్యతిరేకించిన ముస్లిం బోర్డు



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదిత ట్రిపుల్ తలాక్ బిల్లును ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ బోర్డు వ్యతిరేకించింది. బిల్లు ముసాయిదా రూపకల్పనలో ఎలాంటి విధివిధానాలను పాటించలేదని ఏఐఎంపీఎల్‌బీ ఆరోపించింది. ట్రిపుల్ తలాక్ బిల్లును చట్టబద్ధం చేసేందుకు కేంద్రం తీసుకువచ్చిన బిల్లుపై చర్చించేందుకు ఏఐఎంపీఎల్‌బీ ఆదివారంనాడు అత్యవసర సమావేశం ఏర్పాటు చేసింది. అనంతరం సమావేశం వివరాలను ఏఐఎర్పీఎల్‌బీ నేత సజ్జద్ నోమాని మీడియాకు వివరించారు.

ట్రిపుల్ తలాక్ బిల్లును ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. ముస్లిం మహిళలకు మేలు చేసేదిగా ముసాయిదా బిల్లు లేదని, ఈ బిల్లు ఆమోదం పొందితే ముస్లిం కుటుంబాలు అతలాకుతలమవుతాయని అన్నారు. ప్రతిపాదిత బిల్లు ఇస్లాం, షరియత్‌కు వ్యతిరేకమని ఆయన అన్నారు. ముసాయిదా బిల్లు విషయంలో ఎలాంటి విధివిధానాలను పాటించకపోవడమే కాకుండా సంబంధిత భాగస్వాములతో చర్చించలేదని అన్నారు. ఇదే విషయాన్ని ఏఐఎంపీఎల్‌బీ అధ్యక్షుడు నేరుగా ప్రధాని దృష్టికి తీసుకువచ్చి బిల్లును తక్షణంగా నిలిపివేసి, ఉపసంహరించుకోవాలని కోరనున్నట్టు సజ్జద్ నోమని తెలిపారు.

# హిమాచల్‌ప్రదేశ్ కొత్త సీఎంగా జైరాం ఠాకూర్



సిమ్లా: హిమాచల్ ప్రదేశ్ కొత్త ముఖ్యమంత్రి ఎవరనే సస్పెన్స్‌కు తెరపడింది. సెరాజ్ ఎమ్మెల్యే జైరాం ఠాకూర్‌ను ముఖ్యమంత్రిగా బీజేపీ ప్రకటించింది. ఐదుసార్లు వరుసగా ఎమ్మెల్యేగా గెలిచిన జైం ఠాకూర్ హిమాచల్ శాసనసభా పక్షనేతగా ఎన్నికైనట్టు కేంద్ర పరిశీలకుడు నరేంద్ర సింగ్ తోమర్ ప్రకటించారు. జైరాం ఠాకూర్ పేరును మాజీ ముఖ్యమంత్రి ప్రేమ్ కుమార్ ధుమాల్ ప్రతిపాదించగా, ఆ ప్రతిపాదనను శాంతాకుమార్, తరువాయి 2లో






# మేడారానికి పోటెత్తిన భక్తులు



జయశంకర్ భూపాలపల్లి : మేడారం సమ్మక్క సారాలమ్మలను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. వాహనాల రద్దీ ఎక్కువ కావడంతో ట్రాఫిక్‌కు అంతరాయ మేర్పడింది. దీంతో పోలీసులు ట్రాఫిక్ చర్యలు చేపట్టారు. మేడారం గద్దెల వరకు వాహనాలు వెళ్లకుండా జంపన్నవాగు దాటినా తర్వాత వాహనాలను పంట పొలాల్లోకి మళ్లించారు. గద్దెల వద్ద దేవతలకు మొక్కులు చెల్లించడానికి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో సందడి మొదలైంది.

## 64 వేల ఓట్ల ఆధిక్యంతో
# తృణమూల్ ఘన విజయం

- సబాంగ్ అసెంబ్లీకి ఉపఎన్నిక
- తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి గీతా రాణి భునియా

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ మరోసారి తన సత్తా చాటుకుంది. సబాంగ్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థి గీతా రాణి భునియా ఆదివారంనాడు 64,192 ఓట్ల ఆధిక్యంతో భారీ విజయ సాధించింది. సీపీఎం రెండో స్థానంతో సరిపెట్టుకుంది. బీజేపీకి మూడో స్థానం దక్కింది. గీతా రాణి భునియాకు 1,06,179 ఓట్లు పోలయ్యాయి. సీపీఎంకు చెందిన రీటా మాండల్‌కు 41,987 ఓట్లు వచ్చాయి. భారతీయ జనతా అభ్యర్థి ఎ.భట్టాచార్య 37,476 ఓట్లకు పరిమితమయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సబాంగ్ నుంచి విజయం సాధించిన కాంగ్రెస్ ఈసారి కేవలం 18,060 ఓట్లు మాత్రమే రాబట్టుకుంది. సిట్టింగ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే మానస్ ఇటీవల పార్టీకి రాజీనామా చేసి తృణమూల్‌లో చేరడంతో సబాంగ్ అసెంబ్లీకి ఉప ఎన్నిక అనివార్యమైంది.

# అతని మాటలు పూర్తిగా నమ్మా !

నాగర్‌కర్నూల్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సుధాకర్‌రెడ్డి హత్యకేసులో రెండో నిందితురాలు, మృతుని భార్య స్వాతిని నాగర్‌కర్నూల్ జిల్లా పోలీసులు మరోమారు విచారించారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా జైలు నుంచి ఉదయం 10.30 గంటలకు అదుపులోకి తీసుకొన్న పోలీసులు 11.30 గంటలకు నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఠాణాలో పోలీసులు సుమారు 5 గంటల పాటు ప్రత్యేక గదిలో విచారించారు. హత్యకు సంబంధించి పోలీసులు స్వాతిపై ప్రశ్నలు సంధించగా ఆమె కొన్నింటికి జవాబిచ్చినట్లు తెలిసింది.

పోలీసుల ఎదుట రోదించిన స్వాతి

రాజేష్ మాటలు నమ్మి తన భర్తను అన్యాయంగా చంపుకున్నానంటూ స్వాతి పోలీసుల విచారణలో భోరున ఏడ్చింది. అతని మైకంలో ఉండి అతను చెప్పినట్లే చేశానంది. అంతా సినిమాలో మాదిరిగా జరిగిపోతుందని భావించానని పేర్కొన్నట్లు సమాచారం. హత్యకేసుకు సంబంధించిన అదనపు సమాచారం కోసం పోలీసులు నాలుగు రోజులపాటు కోర్టును అనుమతి కోరగా రెండు రోజులు మాత్రమే విచారణకు కోర్టు అనుమతించింది. విచారణ అనంతరం హత్యరోజున స్వాతి ధరించిన దుస్తులు, వినియోగించిన దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సుధాకర్‌రెడ్డిని తలపై గట్టిగా రాడ్‌తో కొట్టగా.. గాయానికి వచ్చిన రక్తాన్ని తుడిచిన దుస్తులను స్వాతి ఇంట్లోని బీరువా నుంచి తీసుకొచ్చారు. ఆమెను ఇంటికి తీసుకెళ్లి బీరువాను తెరిపించి అక్కడ దాచిన దుస్తులను తీసుకొచ్చి కోర్టుకు అందజేశారు. అనంతరం స్వాతిని కోర్టు ఎదుట హాజరుపరిచి మహబూబ్‌నగర్ జైలుకు తరలించారు.



తొలిరోజున దుస్తులపై స్పష్టత ఇవ్వలేదు

మొదటి రోజున విచారించినప్పుడు సుధాకర్‌రెడ్డిని హత్యచేసిన రోజున వారు వేసుకున్న దుస్తులు ఎక్కడ ఉన్నాయని ఆరాతీస్తే పూర్తి సమాధానం ఇవ్వలేదు. రాజేష్ దగ్గర ఉన్నట్లు చెప్పారు. రాజేష్‌ని విచారిస్తే స్వాతికే తెలుసని చెప్పాడు. ఈ సమాచారం కోసం మరోమారు విచారించాం.

## పొట్టి దుస్తులు వేసుకున్నందుకు దారుణహత్య!





బీరట్: గత వారం లెబనాన్ రాజధాని బీరట్‌లో అత్యాచారం అనంతరం దారుణ హత్యకు గురైన బ్రిటీష్ మహిళా దౌత్యవేత్త కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పొట్టి దుస్తులు వేసుకోవడంతో అత్యాచారం చేయడానికి కష్టం కాలేదంటూ విచారణలో నిందితుడు పలు విషయాలను వెల్లడించాడు. బీరట్ పోలీసుల కథనం ప్రకారం.. రెబెక్కా డైక్స్(30) అనే బ్రిటీష్ మహిళ లెబనాన్ లో దౌత్యవేత్తగా సేవలందిస్తున్నారు.

ఈ క్రమంలో గతవారం బీరట్ లోని ఫేమస్ టూరిస్ట్ బార్ నుంచి రెబెక్కా బయటకొచ్చారు. ఇంటికి వెళ్లేందుకు ఉబర్ క్యాబ్ బుక్ చేశారు. క్యాబ్ ఎక్కే సమయంలోనే డ్రైవర్ తరీక్ హచీహ్, రెబెక్కా వస్త్రధారణను గమనించాడు. కొద్దిసేపు క్యాబ్ నడిపాక నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు నిందితుడు. అక్కడ రెబెక్కాపై అత్యాచారం చేసిన ఉరివేసి ఆమెను హత్య చేశాడు. అనంతరం రోడ్డు పక్కన పొదల్లో ఆమె మృతదేహాన్ని వదిలివెళ్లాడు. కొందరు స్థానికులు నగ్నంగా ఓ మహిళ మృతదేహాన్ని గుర్తించినట్లు పోలీసులకు సమచారం అందించారు. రెబెక్కా మృతదేహాన్ని స్థానిక ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఆమెపై అత్యాచారం జరిగినట్లు వైద్యులు నిర్ధారించారు.

సీసీటీవీ ఫుటేజీతో పాటు మహిళా దౌత్యవేత్త రెబెక్కా మొబైల్‌లో ఉబర్ క్యాబ్ బుక్ చేసిన సమాచారాన్ని పరిశీలించిన పోలీసులు నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. రెబెక్కా చాలా అందంగా ఉందని, అందులోనూ ఆమె పొట్టి దుస్తులు (మిని స్కర్ట్) వేసుకోవడంతో అత్యాచారం చేశానని పోలీసుల విచారణలో నిందితుడు వెల్లడించాడు. క్యాబ్ డ్రైవర్ అయినప్పటికీ తరీక్ వద్ద ఆయుధాలు (తుపాకులు) ఉన్నాయని, నిందితుడ్ని మరిన్ని కోణాల్లో విచారించనున్నట్లు బీరట్ పోలీసులు వివరించారు.

## కాంగ్రెస్‌కు శ్రీనాథ్ రాజీనామా

గంగావతి : మద్దతుదారులతో కలిసి శాసనమండలి మాజీ సభ్యుడు హెచ్.ఆర్.శ్రీనాథ్ కాంగ్రెస్ పార్టీకి శనివారం రాజీనామా చేశారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన గంగావతి పర్యటనలో శాసనసభ్యుడు ఇక్బాల్‌అన్సారీని కాంగ్రెస్‌లో చేర్చుకుని టికెట్ కేటాయించే సంకేతాలిచ్చిన నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. శ్రీనాథ్, ఆయన మద్దతుదారులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తాము రాజీనామాలు సమర్పిస్తున్నట్లు ప్రకటించారు. గత నలభై ఏళ్లుగా కొప్పళ జిల్లాలో కాంగ్రెస్‌ను బలోపేతం చేశాం. సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పాత కాంగ్రెస్ నేతలను పట్టించుకోవడం లేదు. ఆయన హిట్లర్‌లా ప్రవర్తిస్తున్నారు. గంగావతిలో కాంగ్రెస్‌కు సేవలందించిన వారిని కాదని జేడీఎస్ నుంచి గెలిచిన అన్సారీ సూచించిన వారికి నామినేటెడ్ పదవులు అప్పగించారు. స్థానిక కాంగ్రెస్ నేతలను సంప్రదించకుండానే అన్సారీని పార్టీలో చేర్చుకునేందుకు సిద్ధమయ్యారు. ఇంకా పార్టీలో చేరకపోయినప్పటికీ అన్సారీని గెలిపించాలని ఇటీవల గంగావతి సభలో వ్యాఖ్యలు చేశారు.

ముఖ్యమంత్రి ఒంటెత్తు పోకడ నచ్చక పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నాం అని శ్రీనాథ్ చెప్పారు. ఎక్కిన నిచ్చెనను తన్నే స్వభావం గల సిద్ధరామయ్య వల్ల కాంగ్రెస్ వినాశనం కానుందన్నారు. కొప్పళ, రాయచూరు, బళ్లారి జిల్లాల్లో పర్యటించి మూల కాంగ్రెస్ వాదులను సంఘటితం చేయనున్నట్లు చెప్పారు. వ్యక్తిగత ప్రతిష్ట పెంచుకునేందుకు యాత్రల కోసం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. శ్రీనాథ్, నగరసభ 12 మంది కౌన్సిలర్లు, పార్టీ వివిధ విభాగాల పథాధికారులు తమ రాజీనామా పత్రాలను కేపీసీసీ అధ్యక్షుడు పరమేశ్వర్‌కు పంపించారు. విలేకరుల సమావేశంలో శాసనమండలి మాజీ సభ్యుడు కరియణ్ణ సంగటి, ఇ.సూరిబాబు, వీరభద్రనాయక్, ఇలియాస్ బాబా పాల్గొన్నారు.

## మొదటి పేజీ తరువాయి

### అమ్మ వారసుడను నేనే

ఓట్ల మెజార్టీతో గెలిచారు. దినకరన్‌కు 89013 ఓట్లు రాగా.. అన్నాడీఎంకేకు 48306 ఓట్లు వచ్చాయి. డీఎంకేకు 24075 ఓట్లు మాత్రమే వచ్చాయి. స్టాలిన్ పార్టీ డిపాజిట్ కోల్పోవడం గమనార్హం. దినకరన్ విజయంతో ఆయన ఇంటి దగ్గర మద్దతుదారుల సంబరాలు అంబరాన్నంటాయి. రెండాకుల గుర్తును ఈపీఎస్, ఓపీఎస్ నేతృత్వంలోని అన్నాడీఎంకేకు కోల్పోయినా.. దినకరన్ మాత్రం కళ్లు చెదిరే విజయం సాధించడం గమనార్హం. ప్రెజర్ కుక్కర్ గుర్తుతో ఈ ఎన్నికల్లో పోటీ చేశారు దినకరన్. ఈ విజయంతో అమ్మ నిజమైన వారసుడిని తానేనని ఆయన ప్రకటించుకున్నారు. గుర్తు కాదు.. పోటీ చేసిన అభ్యర్థి ముఖ్యం అని దినకరన్ అన్నారు. ఆర్కే నగర్ తీర్పు మొత్తం తమిళ ప్రజల తీర్పని దినకరన్ స్పష్టంచేశారు.

మూడు నెలల్లోనే పళని ప్రభుత్వం కూలడం ఖాయమని కూడా ఆయన జోస్యం చెప్పారు. తాను పేరుకే స్వతంత్ర అభ్యర్థి అయినా.. అన్నాడీఎంకేలోని మెజార్టీ సభ్యుల మద్దతు తనకే ఉన్నదని ఆయన తెలిపారు. మొత్తం 19 రౌండ్ల కౌంటింగ్‌లో తొలి రౌండ్ నుంచే దినకరన్ ఆధిక్యంలోకి దూసుకుపోయారు. ఈ దశలోనూ అన్నాడీఎంకే అభ్యర్థి మధుసూదనన్ కనీసం ఆయన దరిదాపుల్లోకి కూడా రాలేకపోయారు. గతేడాది జయలలిత మరణంతో ఈ స్థానం ఖాళీ అయిన విషయం తెలిసిందే. ఆర్కే నగర్‌కు ఈ నెల 21న ఎన్నికలు జరిగాయి. నిజానికి ఈ ఏడాది ఏప్రిల్ 12నే ఎన్నికలు జరగాల్సి ఉన్నా.. ఓట్ల కోసం భారీగా డబ్బు పంచారన్న ఆరోపణల మధ్య వాయిదా పడింది. తాజాగా 21న ఎన్నికలకు ముందు రోజే దినకరన్ వర్గం.. జయలలిత ఆసుపత్రిలో ఉన్న వీడియో రిలీజ్ చేసి కలకలం సృష్టించింది. ఆయన విజయానికి ఈ వీడియో ప్రధాన కారణంగా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

### రాష్ట్రపతి దంపతులకు కేసీఆర్ స్వాగతం

స్టేషన్, బొల్లారం, సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక పోలీసు బలగాలను మోహరించారు. అలాగే రాష్ట్రపతి విడిది సందర్భంగా నిలయంలో కోతులు, పాములను పట్టుకోడానికి బృందాలను ఏర్పాటు చేశారు.

### హిమాచల్‌ప్రదేశ్ కొత్త సీఎంగా జైరాం ఠాకూర్

జేపీ నడ్డా మద్దతిచ్చినట్టు తోమర్ ఆదివారంనాడిక్కడ జరిగిన మీడియా సమావేశంలో ప్రకటించారు. సీఎం అభ్యర్థిగా ఎన్నికల సమయంలో ప్రేమ్‌కుమార్ ధుమాల్‌ను బీజేపీ ప్రకటించినప్పటికీ ఆయన ఎన్నికల్లో ఓడిపోవడంతో నిర్మలా సీతారామన్, నరేందర్ తోమర్‌తో కూడిన కేంద్ర పరిశీలక బృందం ధుమాల్, ఠాకూర్‌లకు మద్దితిస్తున్న వారితో మాట్లాడి ఏకాభిప్రాయం సాధించింది. అనంతరం ఠాకూర్‌ను కొత్త సీఎంగా ప్రకటించింది. కాగా, తన పేరును ప్రతిపాదించి, బలపరచిన కేంద్ర నాయకత్వానికి, ప్రేమ్‌కుమార్ ధుమాల్ సహా నేతలందరికీ జైరాం ఠాకూర్ కృతజ్ఞతలు తెలిపారు.

## ఆధార్‌పై కాంగ్రెస్ రెండు నాల్కల ధోరణి

న్యూఢిల్లీ: ఆధార్ విషయంలో కాంగ్రెస్ పార్టీ రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తోందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉండగా ఒకలా, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండగా మరోలా మాట్లాడుతోందని విమర్శించారు.

యూపీఏ హయాంలో ఆధార్‌కు సంబంధించిన కార్యచరణ శూన్యమని ఎద్దేవా చేశారు. ఆధార్ సృష్టికర్త నందన్ నీలేకని.. ప్రధాని నరేంద్ర మోదీనికి కలిసి ఆధార్ విశిష్టతపై చక్కటి ప్రజెంటేషన్ ఇచ్చారని తద్వారా ఆయనను ఒప్పించారని అన్నారు.

ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఆధార్‌పై వడివడిగా అడుగులు పడ్డాయన్నారు. అదే సమయంలో ఆధార్ వివరాలను గోప్యంగా ఉంచడానికి అవసరమైన చట్టంపై ప్రస్తుత ప్రభుత్వం వెంటనే కార్యాచరణ ప్రారంభించిందన్నారు.

యూపీఏ ప్రభుత్వం విభిన్నమైన ఆలోచనా ధోరణి కలిగి ఉంది. ఆధార్‌పై అసలు ఆసక్తేలేదు. దేశ భద్రతకు సంబంధించిన అంశాలను లెవనెత్తుతోంది. ప్రస్తుత ప్రభుత్వం ఆధార్‌పై ముందుకు వెళ్తుంటే ప్రతిపక్షంలో ఉన్న యూపీఏ ప్రతీ ఆలోచనకు అడ్డుపడుతోంది అని విమర్శించారు.

## సీఎం చంద్రబాబుతో కర్నూలు జిల్లా టీడీపీ నేతల భేటీ

అమరావతి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడితో కర్నూలు జిల్లాకు చెందిన తెలుగుదేశం పార్టీ నేతలు ఆదివారం అమరావతిలో భేటీ అయ్యారు. ఈ సందర్బంగా కర్నూలు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపిక వీరి మధ్య చర్చ జరిగింది. స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్న శిల్పా చక్రపాణిరెడ్డి గత నంద్యాల ఉప ఎన్నికల సమయంలో రాజీనామా చేశారు. దీంతో ఎమ్మెల్సీ ఎన్నిక అనివార్యమైంది. కాగా... ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అధికార తెలుగుదేశం పార్టీ నుంచి ఆశావాహుల సంఖ్య అధికంగా ఉండడంతో ఇప్పటికే ఓ దఫా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా ఇంచార్జి మంత్రి తదితరులు కర్నూలు జిల్లా నేతలతో సమావేశం నిర్వహించారు. కాగా... ప్రస్తుతం సీఎం చంద్రబాబుతో జరుగుతున్న భేటీలో అభ్యర్థిని ఖరారు చేసే అవకాశాలున్నాయని తెలుస్తోంది. దీనిపై సాయంత్రానికి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## మాల్‌లో అగ్ని ప్రమాదం : 37 మంది సజీవదహనం



టెంబిన్ తుపాన్ ధాటికి చిగురుటాకులా వణికిపోతున్న ఫిలిప్పీన్స్‌లో మరో ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఓ షాపింగ్ మాల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు 37 మంది సజీవదహనమయ్యారు. ఫిలిప్పీన్స్ దక్షిణ ప్రాంత నగరం దావోలోని ఓ ఫర్నిచర్ దుకాణంలో శనివారం ఉదయం ఈ ప్రమాదం సంభవించింది. అగ్ని ప్రమాదంలో 37 మంది సజీవదహనమయ్యారని, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారని నగర మేయర్ పాలో డటెర్ట్ వ్యాఖ్యానించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని కోరుకుంటున్నామని ఆయన తెలిపారు. షాపింగ్ మాల్ మూడో అంతస్థులోని ఫర్నిచర్ స్టోర్‌లో మంటలు చెలరేగి పై అంతస్తుకు వ్యాపించాయని ప్రభుత్వ అధికార ప్రతినిధి తెరిసితా గాస్పన్ తెలియజేశారు. ఈ ప్రమాదానికి కారణాలు తెలియరాలేదని, దర్యాప్తు జరుగుతోందని అన్నారు.

మరోవైపు ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు రోడ్రిగ్ డటెర్ట్ బాధితుల కుటుంబాలను పరామర్శించారు. ఈ ఘటనలో గాయపడి ఆరుగురు ప్రస్తుతం చికిత్స పొందుతున్నారని, వారి పరిస్థితి కూడా ఆందోళకరంగా ఉందని వైద్యులు వెల్లడించారు. టెంబిన్ తుపాన్ వల్ల ఇప్పటికే 182 మంది ప్రాణాలు కోల్పోగా, వందలాది మంది గల్లంతయ్యారు. వేలాది మందిని సహాయక శిబిరాలకు సైన్యం తరలించింది. విపత్తు నిర్వహణ సంస్థ అధికారులు, స్వచ్ఛంస్థ సంస్థలు కలిసి సహాయ పునరావాస కార్యక్రమాలను మరింత ముమ్మరం చేశాయి. వరదల్లోకి చిక్కుకుని ప్రాణాలు కోల్పోయిన నదిలో కొట్టుకుపోతున్న డజన్ల కొద్దీ మృతదేహాలను సహాయక సిబ్బంది ఒడ్డుకు చేర్చారు.

## 24 గంటల్లో విధుల్లో చేరండి

కటక్ : డిమాండ్ల పరిష్కారం కోరుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో ఒప్పంద (కాంట్రాక్ట్) విధానంలో పనిచేస్తున్న నర్సులు అయిదు రోజులుగా ధర్నాలు, ఆందోళనలు నిర్వహిస్తున్నారు. మూడు రోజులుగా విధులు బహిష్కరించారు.

వీరి డిమాండ్లను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోకుండా 24 గంటల్లోగా విధుల్లో చేరకపోతే తొలగిస్తామని స్పష్టం చేసింది. జాతీయ ఆరోగ్యమిషన్ సంచాలకురాలు షాలినీ పండిత్ శనివారం ఈమేరకు ప్రకటించారు. విధులు బహిష్కరించి ఆందోళనలో ఉన్నవారు 24 గంటల్లోగా విధుల్లో చేరకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వీరి డిమాండ్లపై ప్రభుత్వం చర్చిస్తోందని, అవసరమైన నిర్ణయాలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం తన నిర్ణయం ప్రకటించే వరకు నర్సులు ఆందోళన విరమించాలని కోరారు. ఆదేశాలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని షాలినీ హెచ్చరించారు.

బెదిరించడం సబబు కాదని కటక్ పెద్దాసుపత్రి నర్సుల యాక్షన్ కమిటీ ప్రతినిధి లీలావతి మహాకుద్ అన్నారు. బెదిరింపులకు లెక్కచేసేది లేదన్నారు. డిమాండ్లు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. వేతనాలు పెంచాలని, ఆరేళ్లుగా గుత్త విధానంలో పనిచేస్తున్నవారిని రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండు చేస్తున్నామని తెలిపారు.

## మహదాయి సాధన కోసం ఆందోళన

బెంగళూరు : మహదాయి నదీ జలాల మళ్లింపు సమస్యను పరిష్కరించాలని కోరుతూ హుబ్బళ్లి నుంచి రాజధాని నగరానికి చేరుకున్న అన్నదాతలు భాజపా ప్రధాన కార్యాలయం జగన్నాథ భవన్ వద్ద ఆందోళనకు దిగారు. గోవా, మహారాష్ట్ర ప్రభుత్వాలను ఒప్పించేందుకు సకారాత్మక ప్రయత్నాలను ప్రారంభించిన భాజపా అధ్యక్షుడు యడ్యూరప్ప తమ ప్రయత్నాల్ని మరింత ముమ్మరం చేయాలని ఆందోళనకారులు డిమాండు చేశారు.

నగరానికి ఉదయానికి చేరుకున్న రైతులు, రైల్వే స్టేషన్ నుంచి భాజపా కార్యాలయం వరకు పాదయాత్ర చేశారు. యడ్యూరప్ప తమ వద్దకు వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు ఆందోళనను విరమించబోమని స్పష్టీకరించారు. భాజపాకు వ్యతిరేకంగా పోరాటం చేయటం లేదని, యడ్యూరప్ప-మనోహర్ పరిక్కర్‌ల మధ్య ప్రారంభమైన చర్చను సాకారం చేయాలనేదే మా లక్ష్యమని ప్రకటించారు. నీటి సాధన విషయంలో యడ్యూరప్పకు అభినందనల్ని తెలియజేస్తూ సిద్ధం చేసిన పత్రాలను వారు ప్రదర్శించారు. మహదాయి వివాదాన్ని న్యాయ పంచాయతి ముందే త్వరగా పరిష్కరించేలా గోవా, మహారాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకు వస్తే ఎక్కువ ప్రయోజనం ఉంటుందని ఆందోళనకారులు తెలిపారు.

ఆందోళన విరమింపజేసేందుకు లోక్‌సభ సభ్యురాలు శోభాకరంద్లాజె విఫలయత్నం చేశారు. ఆందోళనకు రైతు నాయకుడు వీరేశ్ సబరదమత నేతృత్వం వహించగా, మహిళా రైతు కార్మికులు కూడా పెద్ద సంఖ్యలో ఆందోళనలో పాల్గొన్నారు. నవ కర్ణాటక పరివర్తన యాత్రలో ఉన్న యడ్యూరప్ప ఆదివారం ఉదయానికి బెంగళూరుకు చేరుకునే అవకాశం ఉంది.

## వైద్య సేవలకు సహకరించండి

### ఆందోళనలో ఉన్న నర్సులకు పిలుపు

కటక్ : కాంట్రాక్టు నర్సుల డిమాండ్లపై ప్రభుత్వం ఉన్నతస్థాయిలో చర్చిస్తోందని, ఆందోళన విరమించి, రోగుల వైద్య సేవలకు సహకరించాలని ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు విన్నవించారు.

వివిధ డిమాండ్లపై ది ఒడిశా నర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ స్థానిక ఎమ్కేసీజీ వైద్య కళాశాల ఆసుపత్రి శాఖ ప్రతినిధులు విధులు బహిష్కరించి చేపట్టిన నిరవధిక ఆందోళన శనివారంనాటికి మూడో రోజుకు చేరుకుంది. పరిస్థితిని చక్కదిద్దేందుకు స్థానిక శాసన సభ్యుడు రమేష్‌చంద్ర చ్యవుపట్నాయక్, గంజాం జిల్లా పాలనాధికారి ప్రేమ్‌చంద్ర చౌధరి తదితరులు చేసిన వినతులను అసోసియేషన్ ప్రతినిధులు పట్టించుకోలేదు. ఇంతవరకూ ప్రభుత్వం చాలాసార్లు తప్పుడు హామీలిచ్చిందని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శివాని దాస్ చెప్పారు.

తమ డిమాండ్లపై ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇచ్చేవరకూ ఆందోళన కొనసాగుతుందని దాస్ స్పష్టం చేశారు. మరోవైపు వైద్య సేవలకు అంతరాయం ఏర్పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు చర్చించారు. బ్రహ్మపుర సబ్‌కలెక్టరు సిద్ధార్థ శంకర స్వయిన్, ఆసుపత్రి సూపరిం టెండెంటు ఆచార్య చరణ పండా తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఇందిరమ్మ శతజయంత్యుత్సవాలు



విశాఖపట్నం: ఇందిరమ్మ ఒక మహిళా శక్తి అని ద్రోణంరాజు శ్రీనివాసరావు అన్నారు. మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ శ్రీమతి ఇందిరాగాంధీ శత జయంత్యుత్సవాల్లో భాగంగా నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఇటీవల జరిగిన ఇందిరమ్మ చరిత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీల విజేతలకు ఆదివారం నగర కాంగ్రెస్ కార్యాలయంలో బహుమతలను పీసీసీ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీనివాసరావు ప్రదానంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో ఇందిరమ్మ తండ్రి జవహర్‌లాల్ నెహ్రూను ఆంగ్లేయ పాలకులు జైలులో ఉంచిన కాలంలో ఇందిరమ్మకు ఒక లేఖను రాశారు. ఆ లేఖను చూసిన ఇందిరమ్మ పసి హృదయం ఒక్కసారిగా స్పందించి దేశం కోసం నేనూ కూడా పోరాటం చేయాలని తలచి తన తోటిపిల్లలందరితో వానరసేన పేరుతో ఉద్యమానికి నాంది పలికారని చెప్పారు. నాటి నుండి మరణించేవరకు కూడా ఈ దేశానికి ఇందిరమ్మ అంకితమయ్యారని అన్నారు. నగర కాంగ్రెస్ అధ్యక్షులు బెహరా భాస్కరరావు మాట్లాడుతూ ఇందిరమ్మ చిన్నతనం నుంచి దేశానికి ఏ రకమైన సేవలందించారో నేటి తరంవారికి తెలిసేందుకే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. ఇందిరమ్మను ప్రతికార్యకర్త స్ఫూర్తిగా తీసుకుని పనిచేసి కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేవిధంగా కృషి చేయాలన్నారు. మొదటి విజేతకు రూ. 2 వేలు, రెండో విజేతకు రూ. వెయ్యి, మూడో విజేతకు రూ. ఐదు వందలు అందజేశారు.

కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, వుడా మాజీ అధ్యక్షుడు పీఎస్ఎన్ రాజు, సీనియర్ నేత వజ్జిపర్తి శ్రీనివాస్, బీసీ సెల్ చైర్మన్ కొణతాల శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ జగ్గుపల్లి అప్పలరాజు, పీసీసీ మత్స్యకార సెల్ అధ్యక్షుడు కంటుమచ్చు తాతారావు తదితరులు పాల్గొన్నారు.

# భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు సింహాద్రిఅప్పన్న నామకరణం చేయాలి



మాధవధారః బోగాపురంలో ఎయిర్‌పోర్టుకు సింహాద్రి అప్పన్న పేరును నామకరణం చేయ్యాలని జాతీయ ఎస్‌సి, ఎస్‌టి ఛైర్ పర్సన్ శ్రీరాములకు అదివారం సర్క్యూట్ హౌస్‌లో మాధవధార సింహాద్రి అప్పన్న సమైఖ్య కమిటి సభ్యులు సంఘం సభ్యులు ముద్రించిన కరపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రకు మంచి పేరు ప్రఖ్యాతలు పొందిన బోగాపురం ఎయిర్‌పోర్టుకు సింహాద్రి అప్పన్న పేరును నామకరణం చేయ్యడం ఎంతో మంచిందని అని అన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మాధవధార సింహాద్రి అప్పన్న సమైఖ్య కమిటికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ విషయాన్ని కేంద్ర విమానాయ శాఖ మంత్రి అశోక్‌గజపతిరాజుకు తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు సనపల నారాయణస్వామి, చౌధరి కళ్యాణ్‌కుమార్, సనపల రవికుమార్‌స్వామి, పేడాడ సత్తిబాబు, పొన్నాడ రాంబాబు, జివి.రమణ, సనపల ధనుంజేయస్వామి, సనపల రామన్న తదితరులు పాల్గొన్నారు.

# చంద్రన్న క్రిస్టమస్ కానుకలు పంపిణి

భీమునిపట్నం : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజల క్రిస్టమస్ కానుకుగా ఉచిత సరుకులు అందిస్తున్నారని వాటిని సద్వినియోగం చేసుకోవాలని భీమిలి నియోజకవర్గ ఇన్చార్జి చిక్కా విజయ్ బాబు అన్నారు కార్యక్రమంలో బాగంగా తగరపువలస డివిజన్ లో మరియు భీమిలి మండలం ఆర్ తాళ్లవలస గ్రామాల్లో చంద్రన క్రిస్మస్ కానుకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భీమిలి మండల పార్టీ ప్రెసిడెంట్ డి ఏ ఎన్ రాజు, ఎంపీపీ యరబాల కృష్ణ వేణి, అనిల్ ప్రసాద్, భీమిలి మండల జెడ్పీటీసీ అప్పారావు, జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు గాడు వెంకటప్పడు భీమిలి, తగరపువలస టౌన్ టి.డి.పి. అద్యక్షుడు గంటా నూకరాజు, కొప్పల రమేష్, రవ్వ వెంకటరావు, తదితరులు పాలుగున్నారు. అలాగే పద్మనాభంలో చంద్రన క్రిస్మస్ కానుకలు పంపిణీ చేశారు.

# చంద్రన్న క్రిస్మస్ కానుకులు సద్వినియోగం చేసుకోండి



భీమునిపట్నంః రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజల క్రిస్టమస్ కానుకుగా ఉచిత సరుకులు అందిస్తున్నారని వాటిని సద్వినియోగం చేసుకోవాలని టి.డి.పి జిల్లా రూరల్ మహిళా అధ్యక్షురాలు కురిమిన లీలావతి, కార్యక్రమంలో బాగంగా పద్మనాభం మండలాలలో చంద్రన్న క్రిస్టమస్ కానుకులు లబ్ధి దారులకు పంపిణి చేశారు. ఇందులో టి.డి.పి కార్యకర్తలు, తదితరులు పాలుగున్నారు.

# ఉత్తమ సేవలకు రాష్ట్ర స్థాయి పురస్కారం ..

విశాఖపట్నం : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ వివిద రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రభుత్వం అందించే రాష్ట్ర స్థాయి అవార్డులలో పైన్ ఆర్ట్స విభాగానికి , ప్రింటింగ్ మరియు ఫొటోగ్రపీ గాను 2017 సంవత్సరానికి విశాఖ నగరం గోపాలపట్నం ప్రశాంతి నగర్‌కు చెందిన పిట్టా కిరణ్‌కు పైన్ ఆర్ట్సకు గాను ఈ అవార్డు లభించింది . ఈమేరకు శనివారం రాత్రి గుంటురులో జరిగిన రాష్ట్ర స్థాయి క్రిస్మస్ వేడుకలలో పాల్గున్న రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు కిరణ్‌కు అవార్డు అందజేసి సత్కరించారు . ప్రస్తుతం బెంగుళూరులో గేమింగ్ సంస్థలో ఆర్ట్స డైరెక్టర్‌గ విదులు నిర్వహిస్తున్న కిరణ్ ప్రస్తుతం బెంగుళూరులో స్థాపించిన పీక్స్ లెన్స్ ఫొటో గ్రాఫి సంస్థను అతిత్వరలో విశాఖ నగరంలో స్థాపించి ఫొటోగ్రాఫి పైన ఆసక్తి ఉన్న కళాకారులకు ప్రోత్సహించి వారికి తనవంతు సహాయ సహకారాలు పూర్తి స్థాయిలో అందిస్తామని తెలియజేశారు .

# కిడ్నీ భాదితునకు సీఎం సహాయ నిధినుండి విరాళం

పరవాడ: మండల కేంద్రమైన పరవాడ జగన్నాధం వీధిలో గల పైల జగన్నాధరావు కిడ్నీ వ్యాధితో భాధపడుతున్నాడు.

ఈయనకు అసుపత్రి ఖర్చుల నిమిత్తము ముఖ్యమంత్రి సహయ నిది నుండి మూడు లక్షలు రూపాయలును ఇచ్చారు. ఈ చెక్కును ఆదివారము మాజీమంత్రి పెందుర్తి శాసన సభ్యులైన బండారు సత్యనారాయణమూర్తి చేతులు మీదగా పైల సింహద్రిరావుకి అందజేసారు. ఈ కార్యక్రమంలో పరవాడ సర్పంచ్ చుక్క రామునాయుడు, పరవాడ ఎమ్ పిటిసిలు పైల శ్రీనువాసురావు, సిరపురపు అప్పలనాయుడు, భరణికము సర్పంచ్ బొండా తాతారావు, అహర భద్రత సలహ మండల సభ్యులుపైల సన్యాశిరాజు, పైల రామచంద్రరావు, రెడ్డి శ్రీనువాసురావు తథితర్లు పాల్గొన్నారు.

# హర్బర్ అండ్ పోర్టు పించన్‌దార్ల సమావేశం




మాధవధారః హర్బర్ అండ్ పోర్టు పించన్‌దార్లు సమావేశం మాధవధార మాధవస్వామి అలయం అవరణలో గల తోటల్లో అదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్బంగా ముఖ్య అతిధిగా విచ్చేసిన హర్బర్ అండ్ పోర్టు పించన్‌దార్ల గౌరవ అధ్యక్షులు, విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ ట్రస్టీ కామ్రేడ్ వివి.రామారావు మాట్లాడుతూ ఉద్యోగులతో సమానంగా సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి సదుపాయాన్ని పొందడం జరిగిందని అన్నారు. భవన నిర్మాణ కార్మికుల సహకారంతో నూతన భవణా నిర్మాణం జరుగుతుందని అన్నారు. ఫించన్‌దార్లు సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కారించాలని డిమాండ్ చేశారు. అదేవిదంగా పోర్టు పించన్‌దార్లుకు క్వోటర్స్ సదుపాయాము కల్పిండంతో పాటు 50 శాతం కరువు భత్యం బేసిక్ పేలో కలపాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఇటివల ఉద్యోగ విరమణ పొందిన వారికి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హర్బర్ అండ్ పోర్టు పించన్‌దార్లు సంఘం అధ్యక్షులు చౌధరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మరిడిమాంబ తొలేలు ఉత్సవం

విశాఖఫట్నంః చినవాల్తేరు రెల్లివీధి గ్రామదేవత శ్రీమరిడిమాంబ అమ్మవారి 176వ జాతర మహోత్సవాలు హరిహర బాల రెల్లి యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి, తొలేలు రోజైన శనివారం సెంచ్యూరియన్ యూనివర్శిటి వైస్ చాన్సలర్ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, బీచ్‌రోడ్డు కాళీమాత దేవాలయ ఛైర్‌పర్సన్ సుదీప్త బెనర్జీలు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవ కమిటి సమన్వయ కర్త చెన్నా తిరుమలరావు, గ్రామ కులపెద్ద నీలాపు వెంకటరావు, అధ్యక్షులు ఎన్.ధర్మరాజు, ప్రధాన కార్యదర్శి ఇసుకపల్లి వెంకటేశ్వరరావు, కోశాధికారి ఎన్.చంద్రశేఖర్, కార్యదర్శి సి.హెచ్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు మరిడిమాంబ ఉత్సవాల ముగింపు: ఈ నెల 15న ప్రారంభమైన గ్రామ దేవత మరిడిమాంబ అమ్మవారి మహోత్సవాలు ఆదివారంతో ముగియనుంది. ఈ సందర్భంగా పగటివేషాలు, పులి డాన్సులు, నవకాళీ మాతలు, నెమలి, సర్పాలు, బిందెల డాన్సులతో పాటు అనేక సాంస్కృతిక, జానపద నృత్య కళారూపాలతో పెద్ద ఎత్తున ఊరేగింపు జరుగుతాయని అధ్యక్షులు నీలాపు ధర్మరాజు తెలిపారు.

# సీమ ప్రాజెక్టులపై శ్రద్ధ ఏదీ?

## కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసి తీరతాం

## రాయలసీమ అభివృద్ధి బాధ్యత కేంద్రానిదే!

## భాజపా జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు

కడప: అభివృద్ధి ఒకే ప్రాంతంలో కేంద్రీకృతం కావడం వల్లనే హైదరాబాదును కోల్పోయాం.. మళ్లీ అమరావతిలో మాత్రమే అభివృద్ధి చేస్తే సరిపోదు.. వెనుకబడిన ప్రాంతాలలో మొదటి అభివృద్ధి చేపట్టాలి. ముఖ్యంగా రాయలసీమ ప్రాజెక్టులపై శ్రద్ధ చూపి రాయలసీమ అభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి చేయాలి అని భాజపా జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. కడప ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో భాజపా జిల్లా అధ్యక్షుడు పుప్పాల శ్రీనాథ్‌రెడ్డితో కలిసి శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి జలాలపై ఏర్పాటు చేసిన దుమ్ముగూడెం ఎత్తిపోతల పథకాన్ని ఏవిధంగా సాధించాలన్న దానిపై అన్ని రాజకీయ పార్టీలు దృష్టి సారించాలన్నారు. ప్రత్యేక హోదా వల్ల సంవత్సరానికి రూ.3 వేల కోట్లు మాత్రమే వస్తుందని తెలిపారు. రాయలసీమలోని ప్రాజెక్టులను నిర్దిష్టకాలంలో ప్రభుత్వం పూర్తి చేయాలన్నారు. పోలవరం, పురుషోత్తపట్నంపై చూపే శ్రద్ధ రాయలసీమ ప్రాజెక్టులపై కూడా ప్రభుత్వం చూపాలన్నారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని కేవలం సంవత్సరం లోపే పూర్తి చేశారని..రాయలసీమ జిల్లాలో ఉన్న ప్రాజెక్టులను ఎందుకు ఏళ్ల తరబడి పెండింగ్‌లో రాష్ట్ర ప్రభుత్వం పెడుతోందన్నారు. ముఖ్యమంత్రి ప్రతి సోమవారం పోలవరం లాగే సీమలోని ప్రాజెక్టులకు ఒక రోజును కేటాయిస్తే బాగుంటుందన్నారు.

కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు తథ్యం : భారతీయ జనతా పార్టీ కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడం ఖాయమని.. అందులో ఏమాత్రం అనుమానం లేదని భాజపా జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు అన్నారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై ఈనెల 26న మరో కమిటీ సమావేశం కానుందన్నారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై జాతీయ నాయకులను రాష్ట్ర నేతలు కలిశారని, ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అనేదీ భాజపా బాధ్యత అని తేల్చి చెప్పారు. రాయలసీమ అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందన్నారు. కడప, కర్నూలు జిల్లాల నుంచి రాష్ట్ర రాజధాని అమరావతికి వెళ్లేందుకు నాలుగు లైన్ల రోడ్డు ఏర్పాటుకు కేంద్రం మంజూరు చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాజధానిపై పెట్టిన శ్రద్ధ రాయలసీమ అభివృద్ధిపై కూడా పెట్టాలని, రాయలసీమ అభివృద్ధికై ఇప్పటి వరకు కేంద్రం రూ.450 కోట్లు ఇచ్చిందన్నారు. మరో రెండు సంవత్సరాల్లో మరో రూ.300 కోట్లు కేంద్ర ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధికి ఇవ్వనుందన్నారు. కేంద్ర నిధులు దేనికి ఖర్చు పెట్టిందో ప్రజలకు రాష్ట్రప్రభుత్వమే వివరించాలన్నారు.

విజయం భాజపాదే : కులాలను అడ్డుపెట్టుకుని గుజరాత్‌లో గెలిచేందుకు కాంగ్రెసు పార్టీ తీవ్రంగా ప్రయత్నం చేసిందని సోము వీర్రాజు అన్నారు. ప్రధాని మోదీ చేసిన అభివృద్ధికే గుజరాతీలు



మొగ్గు చూపి భారతీయ జనతాపార్టీని ఆరోసారి వరుసగా గుజరాత్‌లో గెలిపించారన్నారు. యూపీలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెసు పార్టీకి ఎందుకు డిపాజిట్లు కూడా రాలేదన్నారు.

భాజపా బలోపేతమే లక్ష్యం : భారతీయ జనతా పార్టీని ఆంధ్రప్రదేశ్‌లో బలోపేతం చేయడమే తమ లక్ష్యమని సోము వీర్రాజు అన్నారు. చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి, కర్నూలు జిల్లాలోని ఎమ్మిగనూరు, ఆదోని, పాణ్యం ప్రాంతాల్లో సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. గ్రామస్థాయి వరకు వెళ్లే పోలింగ్ బూత్‌లను పటిష్టపరచి భారతీయ జనతా పార్టీని ఆంధ్రప్రదేశ్‌లో బలోపేతం చేస్తామన్నారు. అనంతరం నాయకులు, కార్యవర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షుడు పుప్పాల శ్రీనాథ్‌రెడ్డి, భాజపా నాయకులు సింగారెడ్డి రామచంద్రారెడ్డి, నాగోతు రమేష్ నాయుడు, హరినాథ్‌రెడ్డి, శివప్రసాద్, పట్నం ఎరికలప్ప, లక్ష్మణరావు, దుర్గం దస్తగిరి, నాయకురాలు భవానీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భగవతి కృషి ఎనలేనిది

## సత్యవెంకటరావు దంపతులకు సన్మానం



మాధవధారః రైల్వే అభివృద్ధికి కృషి చేసిన భగవతి సత్యవెంకటరావు కృషి ఎనలేనిదని 39వ వార్డు మాజి కార్పొరేటర్ సనపల సీతారామాంజనేయులు, ఈస్ట్ కోస్ట్ రైల్వే పర్సనల్ అఫిసర్ కెఎస్ఎన్.రాజు అన్నారు. అదివారం మాధవధారలో గల శ్రీ మాధవ యువజన సమాజం అడిటోరియంలో రైల్వేలో గూడ్స్ గార్డ్‌గా పని చేసి ఇటివల ఉద్యోగ విరమణ చేసిన భగవతి సత్యవెంకటరావు దంపతులను మాధవధార రైల్వే కార్మిక సంక్షేమ సంఘం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మాధవధార రైల్వే కార్మిక సంక్షేమ సంఘానికి అభివృద్దికి ఆయన ఎనలేని కృషి చేసారని అన్నారు. కార్మికుల సంక్షేమానికే కాక రైల్వే అభివృద్దికి కృషి చేసారని అన్నారు. మాధవధార రైల్వే కార్మిక సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు పప్పల రామచంద్రరావు మాట్లాడూతూ రైల్వే కార్మిక సంక్షేమ సంఘాన్ని స్థానించి 35 యేళ్ళ అయ్యిందని సంఘం ద్వారా సభ్యులకు అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ది కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాధవధార సమన్వయ కమిటి అధ్యక్షులు కంచరాన సూర్యనారాయణ అధ్యతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైల్వే కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షులు వావిలపల్లి వెంకటరావు, సీనియర్ గూడ్స్ గార్డ్ జివి.రమణరావు, కోచింగ్ గార్డ్ యన్ఎస్‌వి.బాబు, శ్రీ మాధవ యువజన సమాజం అధ్యక్షులు భగవతి శ్రీరామూర్తి, విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ ప్రతినిధి కూన సత్యనారాయణ, మాధవ మురళీ విశాఖ స్టీల్ ప్లాంట్ అధ్యక్షులు సనపల శంకర్‌రావు, ఎపి స్టేట్ మాధవ మురళీ వెల్ఫేర్ సంఘం అధ్యక్షులు నళిని, రిటైర్డ్ వెల్ఫేర్ సంఘం కార్యదర్శి యండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# జివిఎంసి పాఠశాల స్వర్ణోత్సవ సంబరాల కరపత్రాల పంపిణీ

మాధవధారః జివిఎంసి పాఠశాల స్వర్ణోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించనున్నట్లు జివిఎంసీ పాఠశాల స్వర్ణోత్సవ కమిటి ఛైర్మన్ సనపల బంగారురాజు తెలిపారు.

ఈ సందర్భంగా అదివారం ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే యేడాది జనవరి 30, 31 ఫిబ్రవరి 1వ తేదిన ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్దులు విజయవంతం చేయ్యాలని కోరారు. ఈ సందర్భంగా మాధవధారలో ఉన్న కొత్తమహలక్ష్మి అమ్మవారు ఆలయం వర్ద ప్రత్యేక పూజా కార్యక్రకమాలను నిర్వహించి కరపత్రాల పంపిణి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో స్వర్ణోత్సవాల కమిటి ప్రతినిధులు సనపల పాండురంగారవు, గొండు అచ్యుతరావు, సనపల రవికుమార్‌స్వామి, సనపల సురేష్, కర్రి రాజేష్‌బాబు, సనపల సుమతి, పెద్ద పాప తదితరులు పాల్గొన్నారు.

EDUCATION
డిగ్రీ రెగ్యులర్ లేదా డిస్టెన్స్‌లో చదివి డిస్కంటిన్యూ అయిన వారికి ఒకే సంవత్సరంలో డిగ్రీ పూర్తి.
AU డిస్టెన్స్ (పాస్ గ్యారంటీ కోచింగ్/గైడెన్స్)
BA/B.Com/B.Sc/MA/M.Com/M.Sc, Diploma/B.Tech/10th/Inter
98487 21118
98487 31118

2018 డైరీలు, క్యాలెండర్లు హోల్‌సేల్
భారతీయ స్టేషనరీ & బుక్ సెంటర్
పూర్ణామార్కెట్ కార్ పార్కింగ్ ఎదురుగా
విశాఖపట్నం 530001
98499 92338, 2561749, 2781865

# విజయభాను సంపాదకీయం

## యుద్ధం వద్దు

భిన్న ధ్రువ ప్రపంచం ఏర్పడుతున్నదనేది చాలాకాలం కిందటే స్పష్టమైంది. ఈ క్రమంలోనే అమెరికా ఐక్యరాజ్య సమితిని శాసించలేని పరిస్థితి ఏర్పడ్డది. ఈ పరిస్థితిలో భారత్ వంటి మూడవ ప్రపంచ దేశాలు ఐక్యరాజ్యసమితిని బలోపేతం చేయడానికి, ప్రజాస్వామ్య బద్ధంగా మార్చడానికి కృషి సాగించాలె. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలే తప్ప యుద్ధాలకు దిగకూడదనే వైఖరిని బలోపేతం చేయాలె. జెరూసలెంను ఇజ్రాయెల్ రాజధానిగా అమెరికా గుర్తించడాన్ని ఖండిస్తూ ఐక్యరాజ్య సమితి సర్వ ప్రతినిధి సభ అత్యధిక మెజారిటీతో తీర్మానం చేయడం మారిన అంతర్జాతీయ వ్యవస్థకు సూచిక. తమకు అనుకూలంగా ఓటు వేయాలంటూ, అమెరికా ఐక్యరాజ్య సమితి సభ్య దేశాలను, ప్రత్యేకించి మిత్ర దేశాలను తీవ్రంగా హెచ్చరించినప్పటికీ, చాలాదేశాలు లెక్క చేయలేదు. తీర్మానంలో అమెరికాను పేరు పెట్టి విమర్శించనప్పటికీ, తీర్మానం సారాంశం ట్రంప్ నిర్ణయాన్ని తప్పు పట్టేదిగా ఉన్నది. భారత్ సహా 128 దేశాలు తీర్మానానికి అనుకూలంగా ఓటే వేస్తే, తొమ్మిది మాత్రమే వ్యతిరేకించాయి. ఈ తొమ్మిది దేశాలలోనూ అమెరికా, ఇజ్రాయెల్ మినహాయిస్తే మిగతావి మైక్రోనీసియా, నవురు, టోగో, టోంగా, పలావు, మార్షల్ దీవులు, గ్వాటెమాల, హోండురస్ వంటి అతి చిన్న దేశాలు. వీటిని అమెరికా నయానా భయానా తనకు అనుకూలంగా మార్చుకున్నది. 35 దేశాలు ఎటూ ఓటేయక పోగా, 21 దేశాలు అసలు ఓటింగ్‌కే హాజరుకాలేదు. తమకు వ్యతిరేకంగా ఓటేస్తే ఐక్యరాజ్య సమితికి నిధులు ఇవ్వడం నిలిపివేస్తామని అమెరికా హెచ్చరించడం నైతిక పతనాన్ని సూచిస్తున్నది. ఈ హెచ్చరికను అమెరికా ప్రముఖులే ఏవగించుకుంటున్నారు. వారం రోజుల కిందట భద్రతా మండలిలో కూడా అమెరికా తీసుకున్న నిర్ణయంపై ఓటింగ్ జరిగింది. భద్రతా మండలిలో వీటో హక్కు గల ఐదు శాశ్వతసభ్య దేశాలు కాకుండా, మరో పది తాత్కాలిక సభ్యదేశాలున్నాయి. మొత్తం పదిహేను దేశాల లో పద్నాలుగు దేశాలు అమెరికాకు వ్యతిరేకంగా ఓటేశాయి. బ్రిటన్, ఫ్రాన్స్ కూడా అమెరికా తో కలిసిరాలేదు. దీనిని బట్టి అంతర్జాతీయ రంగంలో ట్రంప్ నాయకత్వంలోని అమెరికా ఎంత ఏకాకిగా మారిందో తెలుస్తున్నది. కాల మార్పు ఎంత కఠినంగా ఉంటుందో అమెరికా పరిస్థితిని చూస్తే అర్థమవుతుంది. ట్రంప్ విధానాన్ని అమెరికా నుంచి నిధులు పొందే దేశాలు కూడా ఆమోదించకపోవడం ఆశ్చర్యకరమే. అఫ్ఘానిస్థాన్, ఇరాక్ దేశాల నేతలు అమెరికా ప్రతిష్ఠించిన కీలుబొమ్మలు అయినా మద్దతు ఇవ్వలేదు. ఈజిప్టు, పాకిస్థాన్ కూడా అమెరికా వ్యతిరేక తీర్మానాన్ని సమర్థించాయి. మాల్దీవ్స్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ కూడా అమెరికాకు మద్దతు ఇవ్వలేదు. నాటో కూటమిలోని 28 దేశాలలో 21 దేశా లు అమెరికాకు వ్యతిరేకంగా నిలిచాయి. ఇవన్నీ అమెరికా వ్యతిరేకతనే కాదు, ఆ దేశ బలహీనతను కూడా సూచిస్తున్నాయి. ట్రంప్ ఆసియా పసిఫిక్ ప్రాంత ఒప్పందం నుంచి విరమించుకోవడం, నాటో ఖర్చు భరించలేమని చెప్పడం, యునెస్కోకు నిధులు ఇవ్వ నిరాకరించడం మొదలైనవన్నీ అమెరికా క్షీణతకు అద్దం పడుతున్నాయి. ట్రంప్ భవిష్యత్తులో అనుసరించబోమే వ్యూహాలన్నీ ఈ బలహీనత నుంచి వచ్చినవై ఉంటాయి. అమెరికా బలహీనతను కప్పిపుచ్చుకోవడానికి ట్రంప్ మరింత జాత్యహంకార విధానాలను ఆశ్రయిస్తున్నారు. కానీ పశ్చిమాసియా, యూరప్, తూర్పు ఆసియా మొదలైన అన్ని ప్రాంతాలలోనూ ట్రంప్ విధానాలు ప్రతికూల ఫలితాలనే ఇస్తున్నాయి. ఇది అంతర్జాతీయ వ్యవస్థలో వచ్చిన మార్పును సూచిస్తున్నది. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన తరువాత ప్రపంచం నిరంతర యుద్ధ భయం నుంచి బయట పడ్డదనే ఊరట ఎంతో కాలం నిలువలేదు. అమెరికా ఏకైక అగ్రరాజ్యంగా అవతరించింది. ఏక ధ్రువ ప్రపంచం ఏర్పడటం వల్ల అంతర్జాతీయ వ్యవస్థలు బలహీనపడ్డాయి. ఐక్యరాజ్యసమితి ఒక దశలో అమెరికా జేబు సంస్థగా మారుతుందనే భయం ఏర్పడ్డది. కానీ ఇప్పుడు పరిస్థితిలో మార్పు వచ్చింది. అమెరికా బలహీనపడుతున్నది. నాటో దేశాలన్నీ ఏకతాటిపై లేవు. అమెరికాది ఒక దారి అయితే యూరప్ దేశాలది మరో దారి. అఫ్ఘానిస్థాన్ భవిష్యత్‌పై సాగే చర్చలలో అమెరికాను పక్కన పెట్టే ప్రయత్నాలు ఇప్పటికే మొదలయ్యాయి. సమైక్య జర్మనీ ఆర్థిక శక్తిగా అవతరించింది. జర్మనీ- ఫ్రాన్స్ కూటమి యూరోపియన్ యూనియన్‌కు ఇరుసుగా మారింది. చైనా ఆర్థిక శక్తిగా బలపడటమే కాకుండా, ప్రపంచీకరణ చోదక పాత్ర వహిస్తున్నది. భారత్ కూడా ప్రాంతీయంగా బలమైన దేశంగా ఎదిగింది. అమెరికా భారత్ తోడ్పాటు కోసం ఆరాటపడుతున్నది. చైనా కూడా భారత్ ప్రాధాన్యాన్ని విస్మరింపలేదు.

# మన మ్యూజిక్‌కు ప్రపంచం ఫిదా

న్యూఢిల్లీ: బాలీవుడ్ మ్యూజిక్ ఇప్పుడు ప్రపంచమంతటినీ ఉర్రూతలూగిస్తోంది. దీనికితోడు ఈ పాటలకు విదేశీయులు నృత్యం చేసి ఆనందం పొందుతున్నారు. ఇంటర్నేషనల్ రియాలిటీ టీవీ లేదా విదేశాల్లో జరుగుతున్న ఈవెంట్లలో భారతీయ పాటలను విదేశీయులు ఎంతగానో మెచ్చుకుంటున్నారు. తాజాగా మహీంద్ర గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా ఇటువంటి వీడియోను ట్వీట్ చేశారు. బాలీవుడ్ పాటకు కొందరు విదేశీ మహిళలు చేసిన నృత్యానికి సంబంధించిన వీడియోను ట్వీట్ చేశారు. వీరు కత్రీనా నర్తించిన బార్ బార్ దేఖో, నచ్ దే సారె పాటలకు భారతీయ వస్త్రధారణలో అద్భుతంగా నృత్యం చేశారు. ఫిన్లాండ్‌లో మహీంద్ర గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఈ నృత్య ప్రదర్శన జరిగింది.

# 101 ప్రేమజంటలకు సామూహిక వివాహం



కోల్‌కతా: ప్రేమించుకుని పెళ్లి చేసుకునేందుకు తాహతులేని 101 బెంగాలీ పేద జంటలకు కోల్‌కతాకు చెందిన విశ్వ జాగృతి మిషన్ సామూహిక వివాహాలు జరిపింది. నగరంలోని పీసీ గార్డెన్ ఈ వివాహాలకు వేదికైంది. సంప్రదాయ గాగ్రా, షెర్వానీ దుస్తులు ధరించిన కొత్త జంటలు ఈ వివాహ వేడుకల్లో పాల్గొనగా, పెళ్లి కూతురు, పెళ్లి కుమారుడి తరఫు కుటుంబ సభ్యులు, బంధువుల కోసం స్టేజ్‌పైనే కూర్చునేందుకు వేర్వేరు మ్యారేజ్ టెంట్లను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. కట్నకానుకలూ, ఆర్భాటాలు లేకుండా జరిగిన ఈ వివాహ వేడుకలకు ఆధ్యాత్మిక గురువు సుధాన్షు మహరాజ్, పలువురు ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కొత్త దంపతులందరికి వేలి ఉంగరం, సంసారానికి అవసరమైన బీరువా, స్టీల్ పాత్రలు, తరగడాలు, బెడ్‌షీట్లు, ఆభరణాలు, చీరలు, సబ్బులు, ఒక నెలరోజుల రేషన్‌తో కూడిన హైజీన్ కిట్లు అందించారు. ట్రస్టు తరఫున తాము నిర్వహించిన ఐదో సామూహిక వివాహం ఇదని విశ్వజాగృతి మిషన్ ట్రస్ట్ కార్యదర్శి సుశీల్ గోయెంకా తెలిపారు. గత పదేళ్లలో సుమారు 500 మంది జంటలకు శాస్త్రోక్తంగా వివాహాలు జరిపించినట్టు ఆయన చెప్పారు.

# మళ్లీ పుతిన్‌కే అధికార పార్టీ మొగ్గు



మాస్కో: వచ్చే ఏడాది రష్యాలో జరిగే అధ్యక్ష ఎన్నికల కోసం అధికార పార్టీ యునైటెడ్ రష్యా మళ్లీ వ్లాదిమిర్ పుతిన్‌కే మద్దతు తెలిపింది. 2018 మార్చి 18న జరిగే అధ్యక్ష ఎన్నికల్లో అభ్యర్థిగా వ్లాదిమిర్ పుతిన్ నామినేషన్‌కు పార్టీ మద్దతు తెలుపుతోంది.. అని ఆ పార్టీ చీఫ్, రష్యా ప్రధాని డిమిత్రి మెద్వెదేవ్ ప్రకటించారు. యునైటెడ్ రష్యా పార్టీ వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పుడు, భవిష్యత్లో కూడా అన్ని విధాలా పుతిన్‌కు మద్దతు కొనసాగిస్తామని పేర్కొన్నారు. 2012 అధ్యక్ష ఎన్నికల్లో యునైటెడ్ రష్యా పార్టీ తరఫున పోటీచేసి గెలిచిన పుతిన్.. వచ్చే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతుండడం విశేషం. ఇటీవల జరిగిన 13వ న్యూస్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ... ఈసారి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నాను. దేశ అభివృద్ధి కోసం రాజకీయ పక్షాలన్నీ నాకు మద్దతుగా నిలబడతాయని ఆశిస్తున్నాను. నాపై విశ్వాసం ఉంచుతారని బలంగా నమ్ముతున్నాను... అని పేర్కొన్నారు.

# రిలయన్స్‌ను టాప్ 20లో నిలపాలి : అంబానీ



ముంబయి: ప్రపంచలోని టాప్-20 కంపెనీల్లో ఒకటిగా రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్(ఆర్ఐఎల్)ను నిలపడమే తన లక్ష్యమని ప్రముఖ వ్యాపారవేత్త ముకేశ్ ధీరూభాయి అంబానీ అన్నారు. రిలయన్స్ ఫ్యామిలీ డే వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ వేడుకల ద్వారా తన తండ్రికి ఘనమైన నివాళి అర్పిస్తూనే రిలయన్స్ ఇండస్ట్రీస్ వైభవాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటనున్నారు ముకేశ్.

ఈ సందర్భంగా ఆర్ఐఎల్ యువ ఉద్యోగులకు ఐదు లక్ష్యాలను నిర్దేశించారు.

రిలయన్స్‌ను ప్రపంచంలోని టాప్20 కంపెనీల్లో ఒకటిగా నిలపగలమా? అవును మనం చేయగలం. అని అన్నారు. తన ముగ్గురు పిల్లలు తన వారసత్వాన్ని కొనసాగిస్తారన్న నమ్మకం ఉందని, వచ్చే దశాబ్ద కాలంలో ప్రపంచంలో కీలక మార్పులు చోటు చేసుకుంటాయన్నారు. శిలజా ఇంధనం నుంచి స్వచ్ఛ ఇంధనం వె%పునకు.. పచ్చదనం.. పునరుత్పాదాక శక్తివ-నరుల ఇలా అనేక విషయాల్లో మార్పు ఉంటుందన్నారు. భారతదేశానికి స్వచ్ఛమైన ఇంధనాన్ని అందుబాటులోకి తెస్తుందా? అవును కచ్చితంగా తెస్తుంది అని పేర్కొన్నారు. వినూత్న, సరికొత్త సరకును తయారు చేయడం ద్వారా తయారీ రంగంలో విప్లవాత్మక మార్పునకు రిలయన్స్ శ్రీకారం చుట్టాలన్నారు.

వినోదం, ఆర్థిక సేవలు, కామర్స్, తయారీ రంగం, వ్యవసాయం, విద్య, హెల్త్‌కేర్ రంగాల్లో అపార అవకాశాలున్నాయన్నారు. ఈ రంగంల్లో యావత్‌దేశాన్ని మార్చగల తొలి కంపెనీ జియో అవుతుందా? అవును మార్చగలం అని పేర్కొన్నారు. భారతదేశాన్ని ప్రపంచంలో సూపర్‌పవర్‌గా మార్చడంలో తమవంతు సాయం చేయడమే తన ఐదో లక్ష్యమని తెలిపారు.

# కవి సమయం

## విరాట్పురుషుని విశ్వరూపం

వదనం - అగ్ని
నేత్రాలు - అంతరిక్షం
చక్షురింద్రీయం - సూర్యుడు
రెప్పలు - రాత్రింబవళ్లు
దవడలు - జలం
నాలుక - రసం
మాటలు - సకల వేదాలు
కోరలు - యముడు
దంతాలు - స్నేహకళలు (పుత్రాది)
నవ్వులు - మాయలు, ఉన్మాదం
కటాక్షాలు - అంతంలేని సృష్టులు
పెదవులు - సిగ్గు, లోభం
రొమ్ములు - ధర్మమార్గాలు
అధర్మ మార్గం - వెన్ను
పురుషాంగం - ప్రజాపతి
వృషణాలు - మిత్రావరుణులు
కడుపు- సముద్రాలు
ఎముకలు - కొండలు
నాడులు - నదులు
రోమాలు - చెట్లు
నిట్టూర్పులు - వాయువులు
అంతంలేని కాలం - ప్రాయం
కర్మలు - సంసారాలు
వెంట్రుకలు - మేఘాలు

... (సశేషం)...

...కవితా రచన
ప్రొ.అప్పాజి భగవాన్

# పంచాంగం

మాసం : ధనుర్మాసం; తిథి : సప్తమి రా. 9.15
పూర్వాభాద్ర రా. 8.43 వర్జ్యం లేదు

సోమవారం
25-12-2017

**మేషం** : ఏ విషయంలోను ఒంటెద్దు పోగడ మంచిది కాదు. మీ శ్రీమతి మొండి వైఖరి మీకు చికాకు కలిగిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి ఆశాజనకం. బేకరి, పండ్ల, స్వీట్ వ్యాపారాలు జోరుగా సాగుతాయి. **వృషభం** : గృహోపకరణాలు, వాహనం అమర్చు కుంటారు. ఒక కార్యం నిమిత్తం ఆకస్మికంగా ప్రయాణం చేస్తారు. చీటికి, మాటికి ఎదుటివారిపై అసహనం ప్రదర్శిస్తారు. కొంత మంది మీ పలుకుబడి ద్వారా లబ్ధి పొందు తారు. **మిథునం** : ఓర్పు, నేర్పుతో అనుకున్నది సాధిస్తారు. నూతన ప్రదేశాలు సందర్శనలు అనూకిలిస్తాయి. వృత్తుల వారు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవటం మంచిది. కోర్టు వ్యవహారాలు, భూ వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. ఉద్యోగస్తులకు రావలసిన క్లయింలు, అలవెన్సులు ఆలస్యంగా అందుతాయి. **కర్కాటకం:** బంధువుల రాకతో గృహంలో సందడి నెలకొంటుంది. ప్రేమ వ్యవహారాల్లో ఇబ్బందులను ఎదుర్కొంటారు. గతంలో పోల్చుకుంటే ప్రస్తుత ఆర్థికస్థితి కొంత మెరుగనిపిస్తుంది. వైద్య రంగాల వారికి గుర్తింపు, కీర్తి ప్రతిష్టలు లభిస్తాయి. **సింహం:** స్త్రీలకు అలంకారాలు, విలాస వస్తువుల మీద మక్కువ పెరుగుతుంది. సంఘంలో మీ కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. దీర్ఘకాలిక సమస్యల శాశ్వత పరిష్కా రానికి బాగా శ్రమిస్తారు. అకాల భోజనం, శారీరక శ్రమ వంటి ఇబ్బందు లెదుర్కొంటారు. ఇసుక, క్వారీ కాంట్రాక్టర్లకు ప్రభుత్వాధికారుల నుంచి వేధింపుల తప్పవు. **కన్య:** రాజకీయ నాయకులు సభ, సమావేశాల్లో పాల్గొంటారు. మనో ధైర్యంతో యత్నాలు సాగించాల్సి ఉంటుంది. ఏజెంట్లు, బ్రోకర్లు, వృత్తుల వారికి సదవ కాశాలు లభిస్తాయి. బంధుమిత్రుల నుంచి ఒత్తిడి, మొహమ్మాటాలు ఎదు ర్కొంటారు. ప్రముఖ ఆలయాల్లో దైవదర్శనాలు అతికష్టం మీద అను కూలిస్తాయి. **తుల:** ఒక స్థిరాస్తి విక్రయించాలనే ఆలోచన స్ఫురిస్తుంది. ధనవ్యయం అధికంగా ఉంటుంది. మీ భావాలు, ఆలోచనలకు మంచి స్ఫూర్తి లభిస్తుంది. కోర్టు వ్యవహారాలలో ప్లీడర్లకు చికాకులు అధికమవుతాయి. **వృశ్చికం:** ఉపాధ్యా యులకు, విద్యార్థులకు ఒత్తిడి అధికం. ఆర్థిక లావాదేవీలు, కుటుంబ విషయాల పట్ల శ్రద్ధ వహిస్తారు. **ధనుస్సు:** ఎంత శ్రమించినా ఆదాయం అంతంత మాత్రంగానే ఉంటుంది. స్త్రీలకు షాపింగ్‌లోను, పనివారల విషయంలో తగు జాగ్రత్తలు అవసరం. వ్యాపారాల్లో కొత్త కొత్త పథకాలతో కొనుగోలుదార్లను ఆకట్టుకుంటారు. **మకరం:** బంధువులతో చిన్న చిన్న కలహాలు జరిగే ఆస్కారం ఉంది. రవాణా రంగాలలో వారికి మిశ్రమ ఫలితం కానవస్తుంది. ప్రముఖుల పరిచయాలు, పాత మిత్రుల కలయిక మీ ఉన్నతికి దోహదపడతాయి. ఆదాయానికి సరిపడని ఖర్చు కానవస్తుంది. **కుంభం:** దూర ప్రయాణాలలో వస్తువుల పట్ల మెళుకువ అవసరం. హామీలు, చెక్కుల జారీల్లో ఏకాగ్రత వహించండి.ముఖ్యమైన పర్యటనలలో అవాంతారాలు ఎదురైనా జయం పొందుతారు. **మీనం:** వ్యాపారాల్లో నష్టాలు, ఆటంకాలు క్రమేణా అధికమిస్తారు. స్త్రీలపై సన్నిహితులు, చుట్టుపక్కల వారి ప్రభా వం అధికంగా ఉంటుంది. వాహనం నిదానంగా నడపటం క్షేమదాయకం.

# హనుమంతుని యొక్క జన్మ రహస్యం

## సంకీర్తన



భక్తులెందరో హనుమంతుణ్ణి ఆదర్శనీయ దైవంగా ఆరాధిస్తారు. అతణ్ణి మహాహాలుడు, బుద్ధిశాలి, కపిశ్రేష్టుడు, సర్వశాస్త్ర పారంగతుడు, స్వామిభక్తి పరాయణుడు, రామదూత అంటూ ఎన్నోవిధాలుగా ప్రస్తుతిస్తారు. తల్లి అంజనాదేవి కనుక అతణ్ని ఆంజనేయుడంటారు. అతని తండ్రి ఎవరనే విషయంలో శివమహాపురాణం, రామాయణం, పరాశరసంహిత మొదలైన గ్రంథాల్లోని వైవిధ్యగాథలతో అతడి దివ్యజననం ముడివడి ఉంది శ్రీ హనుమాన్ యొక్క జన్మ రహస్యం హనుమాన్ జన్మ కథ, అతని తల్లి అంజన కథతో సంబంధం కలిగి ఉన్నది. హనుమంతుడు, అంజన అనే ఆడకోతి మరియు కేసరి అనే పురుషకోతి యొక్క కుమారునిగా జన్మించాడు. గతంలో అంజన బ్రహ్మ న్యాయస్థానంలో ఒక అప్సరసలా ఉండేది. ఆమె బాల్యంలో ఒక ముని తపోభంగం కలిగించినందుకు శపించబడింది. ఆమె బాల్యంలో, కాళ్ళు ముడుచుకుని ధ్యానంచేసుకుంటున్న కోతిని చూసి, ఆశ్చర్యంతో ఉత్సాహభరితంగా, చిన్నపిల్ల అయిన అంజన కోతిపైన పండ్లు విసిరింది. హఠాత్తుగా ధ్యానానికి భంగం కలిగిన కోతి రూపంలో ఉన్న ముని నిజరూపం పొంది, కోపంతో అంజనను, ఆమె ఎవరితోనైన ప్రేమలో పడిన్నప్పుడు కోతిగా మారమని శాపం ఇచ్చాడు. అంజన చేసిన తప్పు తెలుసుకుని ఆ మునిని క్షమాభిక్ష పెట్టమని యాచించింది మరియు ఆ ముని శాంతపడి ఆమె కోతి రూపంలో ఉన్నా, ఆమెను ఎవరైతే ఇష్టపడతారో మరియు శివుని అవతారమైన శిశువుకు ఆమె జన్మ ఇచ్చినప్పుడు ఆమె శాపం నుండి విడుదల అవుతుందని వరమిచ్చాడు.

శ్రీ హనుమాన్ యొక్క జన్మ రహస్యం అందువలన శాప విమోచనానికి అంజన భూమిపైన జన్మించింది. అడవిలో నివాసం ఏర్పరచుకున్న అంజన ఒక రోజు ఒక పురుషుడిని చూసింది మరియు ఆమె అతనితో ప్రేమలో పడింది. ఆమె ప్రేమలో పడిన క్షణం నుండి, వెంటనే ఆమె కోతిరూపంలోకి మారింది. ఆ మనిషి అంజన వద్దకు వచ్చి తన నామధేయం 'కేసరి' అని, కోతులకు రాజును అని తనను తాను పరిచయం చేసుకున్నాడు. అంజన కోతి ముఖం కలిగి ఉన్నా అతనిని చూసి ఆశ్చర్యపోయింది మరియు ఇచ్ఛానుసారం కోతి మరియు మానవరూపాలను మార్చుకోగలిగిన శక్తి గల అతనిని చూసి అబ్బురపడింది.

అతను తనను వివాహమాడమని అంజనను కోరాడు. అంజన మరియు కేసరి ఆ అడవిలోనే వివాహం చేసుకున్నారు. అంజన శివుడికి పూజలు జరిపి తపస్సు చేసింది. సంతోషించిన శివుడు ఆమెను కోరిక కోరుకోమన్నాడు. అంజన, ముని శాపవిమోచనం కోసం శివుడిని తన కుమారుడిగా జన్మించమని కోరుకున్నది. శివ ఆమె అభ్యర్థనను ఆమోదించాడు.

శ్రీ హనుమాన్ యొక్క జన్మ రహస్యం ఇంకో వైపు దశరధుడు, అయోధ్య రాజు సంతానం కోసం పుత్రకామేష్టి యజ్ఞం నిర్వర్తిస్తున్నాడు. తృప్తిచెందిన అగ్నిదేవుడు రాజుకు పవిత్రమైన పాయసం ఇచ్చాడు మరియు దైవాంశసంభూతులైన సంతానం కోసం ఆ పాయసాన్ని అతని భార్యలకు పంచిపెట్టమని చెప్పాడు. రాజు, అతని పెద్ద భార్య అయిన కౌసల్యకు ఒక భాగం ఇచ్చాడు. ఆ పవిత్ర పాయస భాగాన్ని ఒక గాలిపటం దూరంగా తీసుకెళ్ళింది. ఆ గాలిపటం ఆ పాయసభాగాన్ని (తీపి ఆహారము) అంజన తపస్య స్థలంలో పడవేసింది. మహాదేవుడు, అంజనా చేతుల్లో ఆ పాయసాన్ని ఉంచమని వాయు, గాలి దేవుడిని ఆజ్ఞాపించాడు. పాయసాన్ని చూసిన అంజన అది శివుని దీవేనలుగా భావించి సంతోషంగా ఆమె దానిని త్రాగింది. శ్రీ హనుమాన్ యొక్క జన్మ రహస్యం ఆమె కోతి ముఖంగల శివుని అవతారమైన శిశువుకి జన్మ ఇచ్చింది

మరియు ఈ బాలుడు అంజనాదేవికి జన్మించటం వలన ఆంజనేయుడని, కేసరినందను డని, వాయుపుత్ర లేదా పవనపుత్ర అంటే వాయువు యొక్క కుమారుడని వివిధ పేర్లతో ప్రసిద్ధి చెందాడు. తన బాల్యదశలో కూడా హనుమాన్ చాలా శక్తివంతమైనవాడు. అతను, తన తండ్రి అయిన కేసరి, తల్లి, అప్సర అంజన యొక్క శక్తి, వాయువేగం గలవాడు. హనుమాన్ జననం వలన అంజన శాపవిమోచనం పొందింది మరియు స్వర్గం తిరిగివెళ్ళింది.

శ్రీ హనుమాన్ యొక్క జన్మ రహస్యం హనుమాన్, ఏడుగురు చిరంజీవులలో ఒకడు మరియు శ్రీరాముడికి ప్రచండమైన భక్తుడు. అతను లంక రాజు, రావణుడి బారి నుండి సీతను కాపాడి తిరిగి శ్రీ రాముడికి అప్పగించాడు. హనుమాన్ కథ, మన జన్మ యొక్క రహస్యం, శక్తి గురించి తెలుసుకోవటంలో మనకు సహాయపడుతుంది.

# శారీరక, మానసిక వికాసానికి క్రీడలు దోహదం చేస్తాయి



గుండాల: క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదం చేస్తాయని ఎంపీపీ సంగి వేణుగోపాల్ అన్నారు. గుండాలలో కీ.శే. వై.రాంరెడ్డి స్మారక జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాల పాఠశాలల స్థాయి క్రీడా, సాంస్కృతికోత్సవాలను ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడోత్సవాలను నిర్వహించుకోవడం మంచి పరిణామమన్నారు. పదమూడేళ్లుగా క్రీడోత్సవాలను నిర్వహిస్తున్న నిర్వాహకుల కృషిని ఆయన అభినందించారు. విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. మూడు రోజుల పాటు సాగే ఈ క్రీడల్లో సమైక్యతను చాటాలని కోరారు. క్రమశిక్షణతో క్రీడా, సాంస్కృతికోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. అంతకుముందు విద్యార్థులచే గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు ఎం.రామకృష్ణారెడ్డి, సర్పంచి సునీత, ఎంపీటీసీ సభ్యురాలు అనసూర్య, ఎండీ షర్ఫుద్దీన్, ప్రధానోపాధ్యాయుడు అగ్గిరాములు, సత్యనారాయణరెడ్డి, ఖలీల్, దశరథ, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష

వరంగల్: వరంగల్ గ్రామీణ జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఆమ్రపాలి సమీక్షించారు. గ్రామీణ జిల్లా కలెక్టర్‌గా పని చేసిన ప్రశాంత్ జీవన్ పాటిల్ ఆసిఫాబాద్‌కు బదిలీ కాగా ఆమ్రపాలి పూర్తి అదనపు బాధ్యతలు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆమ్రపాలి గ్రామీణ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చి ఉన్నతాధికారులతో సమీక్షించారు. భూరికార్డుల అప్‌డేషన్, రెండు పడక గదుల నిర్మాణం, టెక్స్‌టైల్ పార్కు, తదితర అంశాలపై పురోగతిని అడిగి తెలుసుకున్నారు. గిరిజన పాఠశాలలు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు ఎలా ఉన్నాయని ఆరా తీశారు. అనంతరం కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బందితో మాట్లాడారు. సమీక్షలో జిల్లా సంయుక్త కలెక్టర్ హరిత, శిక్షణ కలెక్టర్ సంతోష్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆస్తుల పెంపు కోసమే కార్యాలయాల తరలింపు

ఖమ్మం: నగరంలోని ఎన్ఎస్పీ స్థలంలో నూతనంగా నిర్మించతలపెట్టిన బస్టాండ్‌ను త్వరితగతిన నిర్మిస్తారా..? లేక కుంటి సాకులతో తరలిస్తారా అని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రశ్నించారు. బస్టాండ్ నిర్మాణంలో జరుగుతున్న జాప్యంను నిరసిస్తూ సీపీఎం రెండవ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో ఒకరోజు దీక్షను చేపట్టారు. దీక్షలకు నున్నా సంఘీభావం తెలిపి ప్రసంగించారు. నగరంలోని కలెక్టరేట్, జిల్లాకోర్టు, ప్రభుత్వ కార్యాలయాల తరలింపు ప్రజాప్రతినిధుల ఆస్తుల పెంపు కోసమేనని విమర్శించారు. బస్టాండ్ నిర్మాణంలో జాప్యంపై ప్రజలకు అనేక అనుమానాలున్నాయన్నారు. దీనిపై ఖమ్మం శాసనసభ్యుడు పువ్వాడ అజయ్‌కుమార్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం రెండవ పట్టణ కార్యదర్శి వె%.విక్రమ్, నాయకులు నర్రా రమేష్, తాళ్ళూరి రాము, బుర్రి వెంకట్‌కుమార్, కె.గురుమూర్తి, ఉపేందర్‌నాయక్, బీమయ్య, సుదర్శన్, సత్యం, పకీర్‌సాహెబ్, వాసు, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు మెచ్చుకునేలా పనిచేయాలి

ఇల్లెందు: ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను పోలీసులు అమలు చేయాలని, స్టేషన్లకు వచ్చే ప్రజలు బయటకు వెళ్లి పోలీసుల పనితీరును మెచ్చుకునేలా పనిచేయాలని జిల్లా ఎస్పీ అంబర్ కిషోర్ ఝా సూచించారు. ఇల్లెందు పోలీసు స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసుల పనితీరు, నేరాల రేటును ఎస్పీ తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని పోలీసు స్టేషన్లను తనిఖీ చేస్తూ పనితీరును తెలుసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర సరిహద్దులో మావోయిస్టు కదలికలున్నాయని పేర్కొన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఉపాధి శిక్షణలు, స్వయం ఉపాధి పెంపుతో అసాంఘిక కార్యకలాపాలు తగ్గుతాయని తెలిపారు. ఇల్లెందు పోలీసు స్టేషన్‌ను రాష్ట్రంలోనే రోల్ మోడల్ పోలీసు స్టేషన్‌గా రూపొందిస్తామన్నారు. ఈ పోలీసు స్టేషన్‌ను ఆదర్శంగా తీసుకొని జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లను మోడల్ స్టేషన్లుగా మారుస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రకాశ్‌రావు, సీఐ ఎస్.సారంగపాణి, ఎస్సైలు సతీశ్, కొమురెల్లి, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# భక్తులకు ఇబ్బందులు కల్గకుండా చూడాలి

## ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి



ఐనవోలు: ఐనవోలు మల్లికార్జునస్వామి జాతరకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి కోరారు. వచ్చే నెలలో జరిగే మల్లన్న జాతర ఏర్పాట్లపై ఆలయం ఆవరణలో సమీక్ష చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి మాట్లాడుతూ భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ప్రస్తుతం కేవలం 20 మూత్రశాలలు ఉన్నాయని, మరో 60 నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ సరిపోవన్నారు.

తాత్కాలిక మూత్రశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఘన్‌పూర్ నుంచి ఐనవోలు బీటీ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

గ్రామంలో పలు వీధుల్లో సీసీరోడ్ల నిర్మాణాలకు రూ.29.75 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రూ.కోటి వ్యయంతో మురుగుకాల్వల నిర్మాణం, ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

దూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల ఏర్పాటు చేయాలని కోరారు. పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘాను కట్టుదిట్టం చేయాలన్నారు. కలెక్టర్ ఆమ్రపాలి, జాయింట్ కలెక్టర్ దయానంద్, ఆర్డీవో వెంకారెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మ, వరంగల్ మేయర్ నన్నపనేని నరేందర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే రమేశ్, కుడా ఛైర్మన్ మర్రి యాదవరెడ్డి, డీసీపీ వెంకటేశ్వర్లు, ఎంపీపీ మార్నేని రవీందర్‌రావు, ఆలయ ఛైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు, ఆలయ ఈవో సదానందం, సర్పంచి పల్లకొండ సురేశ్, ఎంపీటీసీ సభ్యుడు మధు తదితరులు పాల్గొన్నారు.

# కాజీపేటలో నృత్యాభిషేకానికి ఏర్పాట్లు

కాజీపేట : కాజీపేట రైల్వే స్టేడియం కళాకారులతో హోరెత్తనుంది. భక్తరామదాసు కీర్తనలతో రాముల వారికి ఇక్కడ నృత్యాభిషేకం చేయనున్నారు. భక్త రామదాసు 384వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని కాజీపేట రైల్వే స్టేడియంలో ఈనెల 24 వ తేదీ సాయంత్రం 6 గంటలకు 384 మంది కళాకారులతో ఓరుగల్లు నృత్యోత్సవాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ వారి సహకారంతో నృత్య కళాకారిణులు కె.భ్రమరాంబిక, పి.జ్వాలాముఖి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 384 నుంచి 500 మంది కళాకారులు పాల్గొంటారని కాజీపేట సమాచార కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్వాహకులు ప్రకటించారు. ఇందులో భక్తరామదాసు రచించిన 38 కీర్తనలతో రాముల వారికి నృత్యాభిషేకం చేస్తారు. ఇక్కడ తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్సు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సు, ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్సు కూడా నమోదు అవుతాయి. ఈ సంస్థలకు సంబంధించిన వారు కూడా ఇక్కడ రికార్డులు నమోదు చేసుకోవడానికి వస్తున్నారు. ఇందులో ఆదిలాబాద్, జగిత్యాల, మేడ్చల్, హైదరాబాద్, యాదాద్రి, మంచిర్యాల, జిల్లాల నుంచి 30 మంది నృత్య గురువులు కూడా హాజరౌతున్నారు. వీరి శిష్య బృందాలకు సంబంధించిన 384 మంది కళాకారులు ఇక్కడకు విచ్చేస్తున్నారు. వీరికి రైల్వే కమ్యూనిటీ భవనంలో వసతి ఏర్పాట్లు చేశారు. రైల్వే స్టేడియంలో అందరికీ నృత్యం కనిపించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, అరూరి రమేష్, కార్పొరేటర్లు పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి నృత్యాలు ప్రారంభం అవుతాయని, ప్రధాన నృత్యం సాయంత్రం 6 గంటలకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ రమేష్, వి.నిఖిల, ఎన్.అశోక్‌కుమార్, కె.శంకర్, టి.రచన, డాక్టర్ శ్రావణ కౌముది, నిఖిత పాల్గొన్నారు.

# ప్రజల బతుకు మార్చకుంటే ప్రభుత్వ కుర్చీ మారుస్తాం

## సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



నారాయణపేట : తెలంగాణ ఏర్పడితే బతుకులు బాగుపడతాయని ఆశించారని తీరా ప్రత్యేక రాష్ట్రం అవతరించి అధికారంలోకి వచ్చిన తెరాస ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని.. ప్రజల బతుకు మార్చకుంటే కుర్చీ మార్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోపించారు. సీపీఎం జిల్లా మహాసభలు నారాయణపేటలో ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. రంగులు మార్చే రాజకీయాలను, నాయకులను ఎండగట్టడంతోపాటు స్వచ్ఛమైన రాజకీయాల వైపు వెళ్లాల్సిన అవసరముందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజాస్వామ్య ఫ్రంట్ ఏర్పాటు చేసి రాష్ట్రంలోని 119 అసెంబ్లీ స్థానాలకు పోటీ చేసేందుకు సమాయత్తం అవుతున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రజాస్వామిక విధానాలను అవలంబిస్తున్నాయన్నారు. నల్లధనాన్ని బయటకు తీసుకువస్తానని చెప్పిన ప్రధాని అధికారంలోకి వచ్చాక అమలులో విఫలమైందని విమర్శించారు. ఎన్నికలకు ముందు రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని ఇచ్చిన హామీ సైతం అమలుకు నోచుకోలేదన్నారు. తెలంగాణలో లక్ష ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన తెరాస ప్రభుత్వం ఉద్యోగాల భర్తీలో జాప్యం చేస్తోందన్నారు. పేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం చేపట్టి సాగునీరు అందించమంటే ఎక్కడి నుంచో నీటిని తీసుకొచ్చి పాలమూరు-రంగారెడ్డి ద్వారా నీటిని అందిస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. అంతకు ముందు పేట పట్టణంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే నర్సింహారెడ్డి, జిల్లా కార్యదర్శి రాములు, రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్, టి.సాగర్, వెంకట్రాంరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోపాల్, అరుణ, బాల్‌రాం, కురుమూర్తి, ఎంపీటీసీ లక్ష్మి, గోపాల్, దీప్ల నాయక్, గోపాల్ పాల్గొన్నారు.

# నిత్యరాబడి

యాదగిరిగుట్ట: శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ఖజానాలో వివిధ విభాగాల ద్వారా రూ.10,80,779 నిత్యరాబడి పద్దు కింద జమయ్యాయని దేవస్థానం ఈవో ఎన్.గీత తెలిపారు. ఈ రాబడిలో ప్రధాన పూజలతో రూ.1,02,640, ప్రత్యేక దర్శనాలతో రూ.1,51,000, వ్రతాలతో రూ.68,500, కల్యాణకట్టతో రూ.20,000, అద్దె గదులతో రూ.72,920, శాశ్వత పూజలు రూ.46,464, అన్నప్రసాదంతో రూ.16,465, ప్రసాదాల విక్రయంతో రూ.4,73,940 మిగతావి వివిధ విభాగాల ద్వారా చేకూరాయని ఈవో వివరించారు.

సంస్థను సీజ్ చేసి, నిర్వాహకులపై కేసులు నమోదుచేశారని, స్థిరాస్తులను కోర్టుకచు స్వాధీనం చేశారని చెప్పారు.

వాటిని అమ్మి బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే కొనుగోలు చేసిన వారి ఇళ్లను ముట్టడిస్తామని స్పష్టంచేశారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశం, సత్యంగౌడ్, రెడ్డిపల్లి సర్పంచి భరత్‌గౌడ్ తదితరులున్నారు.

# ఆర్థిక సంసిద్ధత లేని క్యాన్సర్ రోగులు

## 88 శాతం మందికి అవగాహన లోపం

హైదరాబాద్: వైద్య పరంగా ఎంత అభివృద్ధి చెందినా.. సాంకేతికంగా ఎంత పరిణితి సాధించినా.. క్యాన్సర్ రోగాన్ని ఆదిలో గుర్తించకపోతే ప్రాణాంతంగా మారుతోంది. చివరిలో ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రయోజనం ఉండదు. అయితే ఆదిలో గుర్తించడమే ఇప్పుడు కష్టంగా మారింది. నిరక్షరాస్యులే కాదు.. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న వారిలో అధికులు కూడా ఇదే పరిస్థితిలో ఉన్నారని ఓ సంస్థ చేసిన సర్వేలో వెల్లడైంది.

నగరంలో క్యాన్సర్ రోగ విస్తరణ.. రోగ బాధితుల ఆర్థిక పరిస్థితి... వ్యాధికి ఖర్చు చేసే విధానాన్ని తెలుసుకునేందుకు క్యాన్సర్ ఆర్థిక సంసిద్ధతా సర్వే పేరిట నిర్వహించింది. అనేక అంశాల్లో నగర ప్రజలు ఎక్కడ ఉన్నారనే విషయాలను తెలిపింది.

నగరంలో 88 శాతం మంది క్యాన్సర్ బాధితులకు ఆర్థికంగా ఎదురయ్యే సమస్యల గురించి తెలియవు. అధిక సంఖ్యాకులు చికిత్స కోసం తమ వ్యక్తిగత పొదుపు నుంచి కాని.. రుణం తీసుకుని కానీ వె%ద్యం చేయించుకుంటున్నారని సర్వే పేర్కొంది. ప్రతి ముగ్గురులో ఇద్దరు 4వ దశలో మాత్రమే క్యాన్సర్ వ్యాధి వచ్చిందని గుర్తిస్తున్నారని సర్వేలో వెల్లడించింది. 40 మంది అంకాలజిస్టుల (క్యాన్సర్ వైద్యుల) ద్వారా రోగుల స్థితిగతులపై అధ్యయనం చేశారు. క్యాన్సర్ దశలు, రకాలు, చికిత్సకు అయ్యే ఖర్చుకు సంబంధించి హైదరాబాద్ ప్రజల్లో తగిన అవగాహన లేనట్టుగా పేర్కొంది.

61 శాతం మందికి తమ కుటుంబం, స్నేహితుల పరిధిలో క్యాన్సర్ వచ్చిన ఘటనల గురించి తెలియదు. 2020 నాటికి ప్రతి 10 మంది భారతీయుల్లో ముగ్గురికి క్యాన్సర్ సోకే ప్రమాదం ఉందని అంకాలజిస్టులు పేర్కొన్నారు. క్యాన్సర్ బారిన పడినవారిలో 65.7 శాతం అంటే.. ప్రతి ముగ్గురిలో ఇద్దరు క్యాన్సర్ యొక్క చివరి దశ అంటే 3 లేదా 4వ దశలోనే గుర్తిస్తున్నారు.

నగరాల్లోని క్యాన్సర్ రోగాల పడిన వారిలో కేవలం 18 శాతం మందికి మాత్రమే క్యాన్సర్ యొక్క వివిధ దశల గురించి పూర్తి అవగాహన ఉన్నట్టుగా పేర్కొన్నారు. 38 శాతం మందికి కొంతమేరకు తెలుసని, 44 శాతం మందికి అసలు దశలు తెలియని పరిస్థితి.

క్యాన్సర్ చికిత్స.. వ్యాధి రకం, దశ, ఇతర ఆరోగ్య కారకాలపై ఆధారపడి ఉంటుంది. ఇందుకయ్యే ఖర్చును భరించే స్థితిలో అధిక సంఖ్యాకులు సిద్ధంగా లేనట్టుగా సర్వేలో వెల్లడె%ంది. అయితే ఈ చికిత్సకు కొన్ని సంస్థలు బీమా సౌకర్యాన్ని అందజేస్తున్నాయి.

ఆరోగ్య బీమాలోనే ఈ అంశాన్ని కూడా జోడించి లబ్ధి పొందవచ్చంటున్నాయి.

# ఐక్యతతోనే బ్రాహ్మణ సంఘాలు బలోపేతం



కాజీపేట: ఐక్యతతోనే బ్రాహ్మణ సంఘాలు బలోపేతమై అన్ని రంగాల్లో రాణించడానికి అస్కారం లభిస్తుందని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్‌మోహన్ శర్మ అన్నారు. కాజీపేట స్వయం భూ శ్వేతార్క మూల గణపతి ఆయలంలో ఐనవోలు ప్రవీణ్‌కుమార్‌శర్మ అధ్యక్షతన బ్రాహ్మణుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు జగన్‌మోహన్ శర్మ మాట్లాడుతూ మార్వాడి బ్రాహ్మణులు శాఖా భేదం లేకుండా బ్రాహ్మణ ఔన్నత్యానికి పాటుపడాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పరిషత్‌పై బ్రాహ్మణులకు అవగాహన కల్పించాలని, అందుకు యువత నడుం బిగించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు జాగర్లపూడి శ్రీనివాస్‌శర్మ, ఐనవోలు రాధాకృష్ణశర్మ, ఉడుతల శ్రీనివాస్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యాన పంటల సాగుతో రైతుకు మంచి ఆదాయం

## ఉద్యాన, పట్టు పరిశ్రమలశాఖ రాష్ట్ర సంచాలకుడు వెంకట్రామరెడ్డి



కొత్తగూడెం: తెలంగాణ ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు మరింత ప్రోత్సాహాన్ని కల్గిస్తుందని, ఉద్యాన పంటల సాగుతో రైతు మంచి ఆదాయాన్ని గడించవచ్చునని ఉద్యాన, పట్టు పరిశ్రమలశాఖ రాష్ట్ర సంచాలకుడు ఎల్.వెంకట్రామరెడ్డి అన్నారు. జిల్లాలో పర్యటించిన ఆయన డీఆర్‌డీవో కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లాలోని ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పథకాల అమలు తీరు గురించి అధికారులను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు ఉద్యాన పంటలకు అనుకూలమైన నేలలు, ఉష్ణోగ్రతలు, నీటి సౌకర్యం కలిగి ఉన్నాయన్నారు. జిల్లాలోని వివిధ నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలు మంచి నాణ్యతతో ఉంటున్నాయన్నారు. రాష్ట్రంలోని ఉభయ జిల్లాల రైతులు ఇక్కడి నర్సరీల మొక్కలనే తీసుకెళ్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారంలో ఉద్యాన నర్సరీల ద్వారా 50 లక్షల నాణ్యమైన పండ్ల మొక్కలను నాటినట్లు తెలిపారు. సీతారామ ప్రాజెక్టు కింద 55వేల హెక్టార్లో ఉద్యాన మొక్కలను సాగు చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. దేశంలో అతిపెద్ద అయిల్ పాం పరిశ్రమ జిల్లాలోని అశ్వారావుపేటలో నెలకొల్పారన్నారు. ఇది గంటకు 90 టన్నుల సామర్థ్యంతో ఉత్పత్తి చేస్తుందన్నారు. దానికనుగుణంగా జిల్లాలో 45 వేల హెక్టార్లలో అయిల్‌పాం సాగు కావాల్సి ఉండగా.. కేవలం 15 వేల హెక్టార్లలో మాత్రమే సాగవుతుందని ఇంకా పెంపుదలను అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాను అయిల్‌పాం బెల్ట్‌గా తయారు చేయాలన్నారు. జిల్లాలో పట్టు ఉత్పతి పంటలపై ప్రత్యేక దృష్టిసారించాలని, రెండు శాఖలు వేరుకావని సమన్వయంతో అభివృద్ధి సాధించాలని అధికారులకు సూచించారు. బిందుసేద్యాన్ని రైతులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో డీడీలు మధుసూదన్, ప్రేమ్‌సింగ్, వేణుగోపాల్, భాగ్యలక్ష్మి, లహరి, హేమలత, లత, సుభాషిణీ, జిల్లా ఉద్యాన శాఖాధికారి జినుగు మరియన్న, ఆర్.శ్రీనివాసరావు, పట్టుపరిశ్రమ ఏడీ అనసూయ పాల్గొన్నారు.

### పలు నర్సరీల పరిశీలన

ఉద్యాన, పట్టు పరిశ్రమల రాష్ట్ర సంచాలకుడు ఎల్.వెంకట్రామరెడ్డి జిల్లాలోని పలు నర్సరీలను సందర్శించారు. భద్రాచలం, పినపాక, బూర్గంపాడు, మండలాల్లో రైతులు అంజిరెడ్డి, సురేశ్, కోటేశ్వరమ్మ సాగు చేస్తున్న కూరగాయలు, పట్టు పురుగుల పెంపకాన్ని పరిశీలించారు. షేడ్‌నెట్, బిందుసేద్యం, ఫర్టిగేషన్ పద్ధతిలో చేస్తున్న సాగు గురించి రైతులతో మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో బిందుసేద్య పరికరాల పంపిణీకి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు.

# చిన్నారుల్లో డిప్రెషన్




ఒకే ఇంట్లో ఉండే ఇద్దరు పిల్లల్లో ఒకరిని ఒకలా, మరొకరిని ఇంకోలా చూస్తే వారిలో ఆత్మ న్యూనతా భావం పెరుగుతుందని పరిశోధకులు అంటున్నారు. ముఖ్యంగా చిన్నతనంలో పిల్లల మధ్య వారి తెలివితేటల విషయంలో ఉన్న తేడా పట్ల తల్లిదండ్రులు ఎంత సమతూ కంతో వ్యవహరిస్తే అంత మంచిది. ఇలా వారి మధ్య ఉండే తేడాలను పదేపదే ప్రస్తావించి వారిపై మానసిక ఒత్తిడి తెస్తే మాత్రం ఆ భావన ఆ పిల్లల్లో పెరిగి తామెం దుకూ పనికిరామన్న ఆత్మ న్యూనతకు దారి తీస్తాయి. ఈ బీజాలను నాటేది వేరెవరో కాదు...స్వయానా తల్లిదండ్రులే. దాని వల్ల పిల్లలు పెద్దయ్యాక వారి మధ్య ప్రేమానురాగాలు పెంపొందడానికి బదులుగా ఈర్ష్య, అసూయలు వెల్లువెత్తుతాయి. ఇదే ఆత్మన్యూనతా భావంగా స్థిరపడుతుంది.

ఈ ఆత్మన్యూనతా భావం అనేది ఒక వ్యక్తి జీవితంలో వారి చిన్నతనంలోనే తల్లిదండ్రులు ఇతర పెద్దల అజాగ్రత్తవల్ల, బాఎధ్యతా రహితమైన వ్యాఖ్యల వల్ల వారి మస్తిష్కంలో నాట బడ తాయి. దాని ప్రభావం మనిషి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసిగాని వదలదు. పెద్దలు పిల్లలను తోటి పిల్లలతో పోల్చి మాట్లాడడం లాంటి పొరపాటు చేస్తుంటారు. ఆ మాటలకు ఆ లేత హృదయాలు ఎంతగా గాయ పడతాయో చెప్ప లేము.

ఇక ఆడపిల్లలైతే రూపలావణ్యాలతో అక్కతో, చెల్లితో పోల్చి వారు బాధపడేలా చేస్తారు. రంగులో ఆ పిల్లలను పోల్చి బాల్యం లోనే నల్ల పిల్ల అని ముద్ర వేస్తారు. పొట్టివారైతే పొట్టిపిల్ల అని అంటూ ఆ భావన వారిలో కలిగేలా చేస్తారు. ఇలాంటి మాటల వల్ల ఆ పిల్లల్లో ఆత్మన్యూనతాభావం క్రమంగా పెరిగి బాధను ఎవరికీ చెపలేక తమలో తామే కుంగిపోతుంటారు.

# ముఖవర్చస్సుకు క్యారెట్



మహిళలకు అందమైన మోముంటే అందరూ చాలా బాగుందంటారు. దీనికి రకరకాల ప్రయోగాలు చేస్తుంటారు. కాని ఇంట్లో దొరికే వస్తువులతో ప్రయోగాలు చేసుకోవచ్చంటున్నారు సౌందర్య నిపుణులు.

దీనికి చేయవలసిందల్లా ఒక్కటే... బంగారం లాం టి మేనిమి ఛాయ బంగారంలా మెరవాలన్నా, కంటి ఆరోగ్యం కోసం విటమిన్ ఏ పుష్కలంగా ఉండే క్యారెట్టును వాడాలంటున్నారు. బ్యుటీషియన్స్. ముందుగా ఒక క్యారెట్‌ను తురుముకోవాలి.


అందులో ఒక చెంచా పాలను అందులో కలుపుకొని కాసింత నీటిలో ఉడకబెట్టాలి. చల్లారిన తర్వాత పాలనుకలుపుకుని ముఖానికి, శరీరానికి పట్టిం చండి.

అరగంట అయిన తర్వాత చల్లటి నీటితో ముఖాన్ని శుభ్రపరచండి. దీంతో మీ చర్మం కాంతి వంతంగా మారడమే కాకుండా మృదువుగా తయార వుతుంది. ఏదైన వాడే ముందు వాటికి తగిన జాగ్రత్తలు పాటించడం చాలా మంచిది. ఎందుకంటే ప్రస్తుత రోజుల్లో స్కీన్ సమస్యలు దృష్టిలో ఉంచుకుని వాటిని వాడటం మరి మంచిది. అందం గురించి జాగ్రత్తలు తీసుకునే మందు ఆరోగ్యం గురించి జాగ్రత్తలు పాటించడం ఇంకా మంచిది.




# కడుపులో రాళ్లు పడితే..!

- పిత్తాశయంలో కదలికలు మందగిస్తాయి
- కడుపులో రాళ్లను తొలగించడమే పరిష్కారం
- రాళ్లు ఎక్కువగా ఉంటే జీర్ణం కాదు
- పిత్తాశయ గోడల్లో వాపు వస్తుంది




ఇటీవల కాలంలో కడుపులో రాళ్లు పడటం అన్నది కామన్‌గా మారింది. ఈ మధ్య చిన్న పిల్లల్లో కూడా ఈ సమస్యను గుర్తించటం జరుగుతోంది. తీవ్రమైన కడుపు నొప్పితో బాధ పడుతున్న వారిలో ఈ సమస్య కనిపిస్తోంది. జీర్ణ వ్యవస్థలోని పిత్తాశయం (గాల్ బ్లాడర్), క్లోమం (పాన్ క్రియాజ్) వంటి భాగాల్లో ఈ రాళ్లు ఏర్పడుతుంటాయి. ఈ రాళ్లతో వచ్చిన అనర్థాలు అన్నీ ఇన్నీ కావు. ఈ రాళ్లను బట్టి చికిత్స ఆధారపడి ఉంటుంది. రాళ్లను తొలగించటం అన్నది అంతిమ పరిష్కారం అని గుర్తుంచుకోవాలి.

పైత్యరసంలోని కొలిసిస్టిన్ ఎక్కువగా ఏర్పడి నప్పుడు ఇబ్బంది ఏర్పడుతుం ది. దీంతో పాటు పిత్తాశయంలో వాపు ఏర్పడే అవకాశం ఉంటుం ది. దీన్ని కొలిసిస్టిటిస్ అని వ్యవహరిస్తారు. నొప్పి తీవ్రత ద్వారా దీన్ని గుర్తించవచ్చు. కుడి వె%పు పై భాగంలో ఇది మొదలవుతుంది. తర్వాత కుడిపైపు స్కా ప్యులా ఎముక ఉండే చోటికి వ్యాపించవచు. చాలాసార్లు వేపుళ్లు, నూనె దినుసులు, జంక్ ఫుడ్ తిన్న తర్వాత తలెత్తుతుంటుంది. కొద్ది పా టి జ్వరం, డయేరియా, వాంతులు, నాసియా వంటి లక్షణాల్ని కూడా గమనించవచ్చు. కొన్ని సార్లు పిత్తాశయం గోడల్లో వాపు గమనించవచ్చు. తీవ్రమె%న కేసుల్లో నెక్రోసిస్, గోడల్లో ధ్వంసం జరగటాన్ని చూడవచ్చు. గోడలు వాపు ఏర్పడిన పరిస్థితిని సాధారణ కొలిసిస్టిటిస్‌గా వ్యవహరిస్తారు. తర్వాత కాలంలో పిత్తాశయం లో కదలికలు బాగా మందగిస్తాయి. వ్యాధి ముదిరిన దశను తీవ్రతర కొలిసిస్టిటిస్‌గా చెబుతారు.

ఇక క్లోమం విషయానికి వస్తే .. క్లోమంలో స్రవించే ఎంజైమ్‌లు పేగుల్లోకి వచ్చి అక్కడ ఆహారాన్ని జీర్ణం చేయాల్సి ఉంటుంది. కొన్ని సార్లు ఈ ఎంజె%మ్‌లు క్లోమంలోనే ఉండి పోయి అక్కడ పనిచేయటం మొదలు పెడతాయి. ముఖ్యంగా ట్రిప్సిన్ ఇటువంటి పనులకు పాల్పడుతుంది. దీంతో క్లోమం లోపలి గోడలు పాడె% పోతాయి. క్రమంగా మొత్తం క్లోమం దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుంది. దీన్నే పాన్‌క్రియాటిస్‌గా వ్యవహరిస్తారు. ఇక, రాళ్ల సమస్య పెద్దదిగా అయినప్పుడు ఇతర జీర్ణ భాగాలకు ఇబ్బది తలెత్తవచ్చు. కొన్ని సార్లు క్లోమంలో కాల్సియం డిపాజిట్లు ఎక్కువగా పేరుకొని పోతే రాళ్లుగా మారతాయి. ఇవి జీర్ణ రసాల్ని అంటే ఎంజైమ్‌ల స్రావాన్ని అడ్డుకొనుట ద్వారా సమస్యల్ని తెచ్చి పెడతాయి. తీవ్రమైన నొప్పితో పేషంట్లు బాధ పడతారు.


పిత్తాశయంలో రాళ్లను గుర్తించాక అది ప్రాథమిక దశలో ఉందా, లేక వ్యాధి తీవ్రం అవుతోందా అన్నది తేల్చుకొంటారు. చాలా ప్రాథమిక దశ అయినప్పుడు మందులతో వాటిని కరిగించేందుకు యత్నిస్తారు. లేని పక్షంలో కొలిసిస్టెక్టమీ అనే ఆపరేషను అవసరం అవుతుంది. పూర్వం కడుపుని కోసి ఈ ఆపరేషను చేయాల్సి వచ్చేది. ఇప్పుడు లాపరోస్కోపీ విధానంలో ఇది చాలా సురక్షితంగా, తేలికగా మారింది. చాలా సార్లు పిత్తాశయాన్ని తొలగించటమే అంతిమ పరిష్కారం అవుతుంది. క్లోమంలో రాళ్లను కరిగించటానికి లిథో ట్రి ప్సీ టెక్నిక్‌లను ఉపయోగిస్తారు. ఆధునిక టెక్నాలజీ సాయంతో దీన్ని సురక్షితంగా తేలిగ్గా పూర్తి చేయవచ్చని గుర్తుంచుకోవాలి. ఇది ఆధునిక టెక్నాలజీ తో కూడిన ఆపరేషన కాబట్టి నిపుణులె%న సర్జన్‌లతో చేయించుకోవటం మేలు.

మానవ శరీరంలో అతి చిన్న భాగాల్లో ఒకటిగా పిత్తాశయంను చెప్పుకోవచ్చు. కడుపులో కుడి వైపున పై భాగంలో ఇది అమరి ఉంటుంది. కాలేయానికి కింది భాగంలో ఉండే సంచీ వంటి భాగం ఇది. ఒక రకంగా చెప్పాలంటే కాలేయానికి అనుసంధానంగా వ్యవహరించే భాగం అనుకోవచ్చు. కాలేయం నుంచి స్రవించే పైత్య రసం తాత్కాలికంగా నిల్వ ఉండే సంచీ వంటి భాగమే పిత్తాశయం. పైత్య రసంలో వాస్తవానికి ఎటువంటి ఎంజైములు ఉండవు. కానీ, జీర్ణక్రియకు సహకరించే కొలెస్టిరాల్, బైలి రుబిన్ అనే పదార్థాలు ఇందులో ఉంటాయి. పైత్య రసం పిత్తాశయంలో ఎక్కువగా నిల్వ ఉన్నప్పుడు కొలిస్టిరాల్‌కానీ, బైలిరుబిన్ కానీ ఎక్కువగా పేరుకొని పోతుంది. అటువంటప్పుడు ఈ పదార్థాలు ఘన రూపంలోకి మారి రాళ్లుగా పరిణామం చెందుతాయి. కొలిస్టిరాల్ కానీ రాళ్లుగా మారితే కొలిస్టిరాల్ రాళ్లు అనీ, బైలిరుబిన్ ఘన పదార్థంగా మారితే పిగ్మెంట్‌రాళ్లు అని వ్యవహరిస్తారు. పైత రసం లో ఇతర పదార్థాల శాతం పెరిగిపోయినా ఇది తలెత్తవచ్చు. కాలేయ వ్యాధులు, రక్త ప్రస రణ వ్యాధులు తలెత్తినప్పుడు కూడా రాళ్లు వస్తుంటాయి. రాళ్లతో నేరుగా వచ్చే ప్రమాదం కంటే ఇతర సమస్యలతో ఇబ్బందులు ఉంటాయి.

# గోళ్ళ ఆరోగ్యమే ... వేళ్ళ అందం

శుభ్రత అనగానే ముందు గుర్తురావాల్సింది చెతులకున్న గోళ్లు. ఎందుకంటే, మనం ఏం తిన్నా ముందు నోట్లోకి వెళ్లడానికి అస్కారం ఉంది. కాబాట్టి అలాంటి గోళ్లనే మనం నిర్లక్ష్యం చేస్తే, అది అనారోగ్యమని తెలిసినా సరే! ఎప్పటికప్పుడు అనుకుంటూనే మరేం ఫర్వాలేదని బద్ధకించేయడమూ మనకున్న నిత్యమైన అలవాటు. గోళ్ల విషయం లోనే! పైగా గోళ్లను చూసి ఆరోగ్యం ఎలా ఉందో చెప్పేస్తారు వైద్యులు. మరి నఖాల గురించి కొన్ని విషయాలు తెలుసుకుంటే ఆపై జాగ్రత్తలు తీసుకోవడం ఎంత అవసరమో తెలిసిపోతుందిగా!కొందరు రికార్డుల కోసం గోళ్లను పెంచుతుంటారు.అలాంటి వారికి ఇవి చాలా ఉపయోగకరం గోళ్లను పెంచుతారు కాని వారు శుభ్రం పాటించరు అలాంటి వారు క్రింది విధానాలను తెలుసుకోవచ్చు.గోళ్లు కొరుక్కోవడం అనే అలవాటు ఉంటే తక్షణం మానుకోవడం బెటర్!

గోళ్లు ఎప్పటికప్పుడు కత్తిరించుకోవాలి. ఎన్నో రకాల సూక్ష్మక్రిములు, మట్టి నోట్లోకి వెళ్లేది గోళ్ల ద్వారానే! స్నానం తరువాత కత్తిరించుకుంటే గోళ్లు మెత్తగా ఉండి కత్తిరించడం సులువవుతుంది. లేకుంటే పెళుసుగా ఉండి విరిగిపోతాయి. నెయిల్ పాలిష్ వేసుకోవడం ఓకే! కానీ, అదేపనిగా గోళ్లరంగు మంచిది కాదు. ఎందుకంటే రసాయనాలు నిండిన గోళ్లరంగు నోట్లోకి వెళితే అనేక అనర్థాలకు దారితీస్తుంది. గోళ్లు పగుళ్లు తీసినట్లున్నా, కాంతిహీనంగా ఉన్నాయంటే మన శరీరంలో విటమిన్ ఎ, కేల్షియమ్ లోపించాయని అర్థం. అందుకే విటమిన్ ఎ ఉన్న కేరెట్లు, పళ్లు, ఆకుకూరలు, కేల్షియమ్ మెండుగా ఉన్న పాలు, బాదాములు అధికంగా తీసుకోవాలి. అప్పుడే గోళ్లు గులాబీ రంగులో చూడముచ్చటగా మారేది! కాలకృత్యాలు తీర్చుకున్నాక ఎప్పటికప్పుడు సబ్బుతో శుభ్రంగా చేతులు కడుక్కోవాలి. డబ్బాల మూతలు తీయడానికి గోళ్లను ఉపయోగిస్తున్నారంటే చేతులారా వాటిని పాడుచేస్తున్నట్లే! ఈ



**అలవాటుకు స్వస్తి పలికితే నయం!**

ముఖ్యంగ రాత్రి నిద్రపోయే ముందు చేతులు శుభ్రంగా కడుక్కుని, తుడుచుకున్నాక మాయిశ్చరైజర్ అప్లై చేస్తే చేతులు, గోళ్లు మృదువుగా ఉంటాయి.

సబ్బుల వాడకం సమయంలో జాగ్రత్త పాటించాలి.

శరీరానికే కాదు, నీరు గోళ్లకూ అవసరమే! కాబట్టి, మంచినీళ్లు ఎక్కువగా తాగండి!అహారం తీసుకొనే సమయంలో వాటిని చాలా శుభ్రం చేసుకోవాలి.

నాణ్యమైన నెయిల్‌పాలిష్ వాడితే మంచిది.

నెయిల్ పాలిష్ తీయాలంటే బ్లేడుతో గీకడం కాకుండా నెయిల్ పాలిష్ రిమూవర్ ఉపయోగించాలి.

గోళ్లను పెంచే క్రమంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి.

తాజా పోషకాహారం తీసుకుంటే గోళ్లూ ఆరోగ్యంగా ఉంటాయి.

12 విటమిన్ లోపిస్తే గోళ్లు పొడిబారి, నల్లగా మారతాయి. గుడ్డు, పాలు, మాంసం... వంటివాటిలో

12 సమృద్ధిగా వుంటుంది.ఈ జాగ్రత్తలు చాలు! గులాబీ వర్ణంలో మెరిసే సౌందర్యం మీ సొంతమవడానికి! చూపరులను ఇట్టే ఆకట్టుకోవడానికి!

## నీళ్లు సరిగ్గా తాగడం లేదని తెలిపే డేంజర్ సంకేతాలివే..

*నీళ్లు తాగుతున్నారా ? అంటే బాగా తాగున్నాను అన్న సమాధానమే చాలా మంది చెబుతారు. కానీ.. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఒక బాటిల్ లేదా ఒక లీటర్ కూడా నీళ్లు తాగి ఉండరు. ఇది ఒకరు, ఇద్దరి సమస్య కాదు. చాలా మంది నీళ్లు తాగాలంటే చాలా బద్ధకంగా ఫీలవుతారు. అలాగే నీళ్ల తాగడం అంటే.. ఏదో మెడిసిన్ తాగినట్టు ఫీలవుతుంటారు. కానీ.. నీళ్లు తాగడం చాలా అవసరం. ఎందుకంటే.. మనుషుల శరీరం మూడోవంతు నీటితోనే నిర్మాణమై ఉంటుంది. కాబట్టి నీళ్లు సరిగా అందకపోతే.. శరీరంలో అనేక సమస్యలు ఎదురవుతాయి. 10 రోజుల్లో ఎఫెక్టివ్ గా బరువు తగ్గించే వాటర్ డైట్ శరీరంలోని ప్రతి భాగం, ప్రతి చిన్న అవయవం, టిష్యూ, కణం అన్నీ కూడా నీటిపై ఆధారపడి ఉంటాయి. శరీరానికి సరిపడా నీళ్లు తాగడం వల్ల శరీరంలో ఫ్లూయిడ్స్ స్థాయి బ్యాలెన్డ్ గా ఉంటుంది.*

*బాడీ టెంపరేచర్ రెగ్యులేట్ అవుతుంది. మలినాలు బయటకు వెళ్లడానికి సహాయపడుతుంది. జీర్ణక్రియ సజావుగా సాగుతుంది. అంతే చర్మం ప్రకాశవంతంగా కనిపించడానికి కూడా నీళ్లు తాగడం తప్పనిసరి. రైస్ వాట్ర్‌తో మైండ్ బ్లోయింగ్ బెన్ఫిట్స్ అయితే శరీరానికి కావాల్సిన స్థాయిలో నీళ్లు అందకపోతే.. శరీరంలో అనేక మార్పులు కనిపిస్తాయి.*

# మాతృత్వపు మధురిమ ఆస్వాదించండి



గర్భధారణ సమయంలో శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకోవడం చాలా సర్వసాధరణం. ఈ మార్పులు ప్రతి మహిళ శరీరంలోనూ ఏర్పడుతాయి. గర్భధారణ సమయంలో మహిళలకు సాధారణ జీవితాన్ని గడపాలని సూచిస్తుంటారు. అయితే గర్భధారణ సమయంలో ప్రమాదకర కార్యకలాపాలు కొన్ని ఉన్నాయి. కాబట్టి గర్భధారణ సమయంలో ఎల్లప్పుడూ సురక్షితంగా ఉండటం ఉత్తమైన మార్గం. దాని తర్వాత అన్నీ. ఎందుకంటే గర్భధారణ అనేది 9నెలలు మాత్రమే కాబట్టి ఆ 9నెలలు మహిళలకు చాలా విలువె%న సమయంగా భావించాలి. గర్భధారణ సమయంలో ఎటువంటి కార్యకలాపాలు ప్రమాదకరమె%నవో మీకు తెలిసుండకపోవచ్చు. కానీ మనకు తెలసిన కొన్ని కార్యకలాపాలు మాత్రం న్యూట్రీషియన్ ఫుడ్ అధికంగా తీసుకోవాలి. దూర్రపయాణాలు చేయకూ డదు. దగ్గర ప్రయాణలైనా తగు జాగ్రత్తలు తీసుకోవాలి మరియు అధిక బరువులు మోయకూడదు మొదలగునవి. కాబట్టీ మీ గర్భధారణ సమయంలో సురక్షితంగా ఉండటానికి చాలా చాలా లౌకిక విషయాలను తెలుసుకోవల్సిన అవసరం ఉంది. ఉదా: మీకు రాక్ బ్యాండ్ యొక్క సంగీతానికి హాజరు కావడం అనేది గర్భధారణ సమయంలో ప్రమాదకర కార్యకలాపంగా చెప్పవచ్చు. గర్భధారణ సమయంలో అధికంగా వ్యాయామం చేయడంతో హార్ట్ బీట్ పెరుగుతుంది మరియు ఇతర ఆరోగ్య సమస్యలు కూడా పెంచుతుంది. గర్భధారణ సమయంలో ఉదర భాగంలో వ్యాక్సింగ్ చేయించుకోవడం కూడా మంచిది కాదు. ఇటువంటి కొన్ని చిన్న విషయాలు మీ గర్భధారణ సమయంలో సురక్షితమా కాదా అని గుర్తించేందుకు మరికొన్ని మీకోసం బోల్డ్ స్కై అందిస్తుంది. ఈ రిస్కీ యాక్టివిటీస్ కు గర్భాధారణ సమయంలో దూరంగా ఉండీ ఆరోగ్యాన్ని సురక్షితం చేసుకోండి... ఫర్నీచర్‌ను మార్చకూడదు సాధారణంగా ఇంట్లో వస్తువులు ఫర్నీచర్‌ను ఇక్కడి అక్కడ.. అక్కడవి ఇక్కడ మార్చుతుంటారు. అయితే మీ గర్భధారణ మొదటి సెమిస్టర్ (మొదటి మూడు నెలల్లో) ఇటువంటి రీస్కీ యాక్టివిటీస్ ను నివారించడం చాలా క్షేమం. ఇది మీ మీద ఒత్తిడిని పెంచుతుంది.

**పిల్లలను మోయడం** మీ రెండవ ప్రెగ్నెన్సీ కంటే ముందు మీకు పిల్లలను చూసుకోవల్సిన బాధ్యత ఉంటుంది కాబట్టి, వారు 5కేజీల బరువు కంటే ఎక్కువగా ఉన్నప్పుడు అతనిని/ఆమెను ఎత్తుకోవడం నివారించడం. లేదంటే మీ వెన్నుకు ఒత్తిడి కలిగించవచ్చు. స్కేటింగ్ వ్యాయామంలో చాలా మంది రోలర్ స్కేటింగ్‌ను ఉపయోగిస్తారు. అయితే మహిళలు గర్భధరించినప్పుడు, ఈ రోలర్ స్కేటింగ్ వ్యాయామాన్ని మానుకోండి. రోలర్ స్కేటింగ్ చేయడానికి మంచి బ్యాలెన్సింగ్ ఉండాలి.స్టీమ్ బాత్‌గర్భధారణ సమయంలో స్టీమ్ బాత్ చేయడం అనేది చెడు ఆలోచన. ఎప్పుడైతే మీ శరీరం వేడి పొందుతుందో, అప్పుడు మీ చర్మని బ్లెడ్ సెల్స్ రీడైరెక్ట్ గావింపబడి మీ చర్మాన్ని చల్లబరుస్తుంది.

# చిత్రభాను

## వీళ్లు మనుషులకు కాకుండా....



సినిమా కథ, సందరాన్ని బట్టి ప్రముఖ నటులు వాయిస్ ఓవర్ ఇవ్వడమో, అందులోని ప్రత్యేక పాత్రలకు డబ్బింగ్ చెప్పడం తరచూ చూస్తూనే ఉన్నాం. హీరో రవితేజ ఇప్పటికే మర్యాద రామన్న చిత్రంలో సైకిల్‌కు వాయిస్ ఓవర్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇలా మనుషులకు కాకుండా వస్తువులకు, జంతువులకు ప్రముఖ హీరోలు వాయిస్ ఓవర్ ఇవ్వడం అనేది చాలా అరుదుగా జరుగుతుంది. ఇలాంటి సినిమాలు త్వరలో మూడు రాబోతున్నారు. రవితేజ, నాని, రానా ఇందులో వాయిస్ ఓవర్ ఇవ్వబోతున్నారు. నాని నిర్మాణంలో తెరకెక్కుతున్న 'అ' సినిమాలో అతను ఓ చేపకు వాయిస్ ఓవర్ ఇస్తున్నారు. ఈ సినిమాలో 'చేప'లా కనిపించనున్నాడు. ఈ న్యూస్ ఇప్పుడు టాలీవుడ్ లో ఇంట్రెస్టింగ్ బజ్ ని క్రియేట్ చేస్తుంది. ఈ చిత్ర నిర్మాణంలో కూడా నాని భాగస్వామిగా ఉన్నారు. చెట్టుకు వాయిస్ ఓవర్ ఇవ్వబోతున్న రవితేజ గతంలో 'మర్యాద రామన్న' చిత్రంలో సైకిల్‌కు వాయిస్ ఓవర్ ఇచ్చిన రవితేజ... ఇపుడు 'అ' సినిమాలో ఓ చెట్టుకు వాయిస్ ఓవర్ ఇవ్వనున్నాడు. బస్సుకు వాయిస్ ఓవర్ ఇస్తున్న రానా హీరో దగ్గుబాటి రానా 'రాజరథం' అనే సినిమాలో బస్సుకు రానా వాయిస్ ఓవర్ ఇస్తున్నారు. ఈ చిత్ర నిర్మాణంలో కూడా రానా భాగస్వామిగా ఉన్నారు. ఈ చిత్రంలో తాను పాత్ర ఏమీ చేయడం లేదని, ఇది ఒక బస్సు చుట్టూ తిరిగే కథ, బస్సుకు వాయిస్ ఓవర్ ఇస్తున్నట్లు రానా తెలిపారు.

## ఆమె లేకపోతే కష్టమే..



బాహుబలి తర్వాత ప్రభాస్ నటిస్తున్న చిత్రం సాహో. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి శ్రద్ధాకపూర్ హీరోయిన్‌గా ప్రభాస్ సరసన నటిస్తున్నది. ఈ చిత్రంలోని శ్రద్ధా కపూర్ పోషిస్తున్న పాత్రపై ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇటీవల మీడియాతో ప్రభాస్ మాట్లాడుతూ.. శ్రద్ధా కపూర్ రోల్ గురించి వివరించారు. ఇంతకీ శ్రద్ధాకపూర్ గురించి బాహుబలి ఏమి చెప్పారంటే.. సాహో చిత్రంలో శ్రద్ధాకపూర్‌ది చాలా కీలకమైన పాత్ర. కేవలం పాటలకు, డ్యాన్స్‌ల కోసం ఆమెను ఈ ప్రాజెక్ట్‌లోకి తీసుకోలేదు. చాలా రోజులుగా ఆమెతో పనిచేస్తున్నాం. ఆ పాత్రకు శ్రద్ధా కరెక్ట్ చాయిస్ అనిపిస్తున్నది అని ప్రభాస్ పేర్కొన్నాడు. శ్రద్ధాది రొటీన్ పాత్ర కాదు నేను బాలీవుడ్ నటితో ఇంతకు ముందు పనిచేయలేదు. ఈ ప్రాజెక్ట్‌లో ఆమె ఉండటం నిజయంగా అద ృష్టమే. పాటల్లో ఆడిపాడటానికి అలా వచ్చి.. ఇలా వెళ్లే రొటీన్ పాత్ర ఆమెది కాదు అని ప్రభాస్ చెప్పారు. శ్రద్ధా ఫైట్స్ కూడా సాహో చిత్రంలో అదుతేమైన యాక్షన్ సీన్లు ఉంటాయి. హాలీవుడ్ ప్రమాణాలకు తగినట్టుగా ఫైట్స్ ఉంటాయి. అలాంటి యాక్షన్ సీన్లలో శ్రద్ధాకపూర్ నటిస్తున్నది. ఈ చిత్రంలో ఆమెది బలమైన క్యారెక్టర్ అని ప్రభాస్ అన్నారు. శ్రద్ధా హార్డ్‌వర్క్, డిడికేషన్ సెట్లో శ్రద్ధా అంకితభావం, హార్డ్ వర్క్ అందరిని ఆకట్టుకొంటున్నది. తన పాత్రకు పూర్తిగా న్యాయం చేయాలని పడుతున్న తపన అదుతేంగా ఉంది. దక్షిణాదిలో నటించి, గుర్తింపు తెచ్చుకొని బాలీవుడ్‌కు పరిచయమైన వారితో పనిచేశాను. శ్రద్ధా ఇప్పటికే హిందీలో స్టార్ హీరోయిన్. అలాంటి హీరోయిన్‌తో నటించడం గొప్ప అనుభూతి అని ప్రభాస్ వెల్లడించాడు.

## మెగా జెండా అన్ని రాష్ట్రాల్లో ఎగరవేస్తారట...

'ఒక్క క్షణం' సినిమా ద్వారా డిసెంబర్ 28న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న మెగా ఫ్యామిలీ హీరో అల్లు శిరీష్ ఇటీవల మెగా అభిమానులతో సమావేశం అయ్యారు. ఈ సందరేంగా శిరీష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మెగా ఫ్యాన్ బేస్ ఇతర రాష్ట్రాలకు విస్తరింప చేసే ప్రయత్నంలో ఉన్నామని తెలిపారు. ఈ తరం మెగా ఫ్యామిలీ హీరోలమంతా తెలుగు రాష్ట్రాల వరకే పరిమితం అయ్యాం. రాబోయే రోజుల్లో చరణ్, బన్నీ, వరుణ్, నేను ఇలా మెగా హీరోలమంతా బయటి రాష్ట్రాల్లో మన ఫ్యాన్ బేస్ పెంచడానికి ప్రయత్నాలు చేస్తున్నామని అల్లు శిరీష్ తెలిపారు. మెగా జెండా ఎగరవేస్తాం ఆల్రెడీ కేరళలో మనకు మంచి పట్టుంది. ఒరిస్సాలో ఎప్పటి నుండో ఉంది. కర్నాటకలోనూ మెగా అభిమానులు ఉన్నారు. తమిళ సినిమాలు కూడా చేసి అక్కడ కూడా మెగా జెండా గట్టిగా ఎగరవేస్తాం. అందుకోసం విశ్వ ప్రయత్నాలు చేస్తామని శిరీష్ తెలిపారు. ఫ్యాన్స్ తలెత్తుకునేలా చేస్తాం మీరిచ్చే అభిమానాన్ని ఎప్పుడూ హక్కుగా భావించలేదు. దాన్నొక బాధ్యతగానే తీసుకున్నాం. ఫ్యాన్స్ గర్వపడేలా సినిమాలు చేయడమే మెగా హీరోల ప్రధాన లక్ష్యమని, వారు తలెత్తుకునే సినిమాలు చేస్తామని అల్లు శిరీష్ తెలిపారు. మెగా అభిమానులు లేకుండా మేము లేము మెగా అభిమానులు లేకుండా మేము లేమని, గత 30 ఏళ్లుగా చిరంజీవి గారి దగ్గర నుండి మొదలైతే కళ్యాణ్ గారు, బన్నీ, చరణ్, తేజ్, వరుణ్, నేను, నిహారిక వరకు ప్రతి ఒక్కరినీ



మీ ఫ్యామిలీ మెంబర్‌గా ట్రీట్ చేసి ప్రతి అడుగులోనూ సపోర్టుగా ఉన్నారు. సినిమాల పరంగానే కాదు, మేము చేసే సోషల్ యాక్టివిటీస్‌లోనూ మాకు చేదోడు వాదోడుగా ఉన్నారు. మీ రుణం ఎప్పటికీ తీర్చుకోలేమని శిరీష్ అన్నారు.

## జక్కన్న మావోడు..



బాహుబలి చిత్రంతో దర్శక ధీరుడు ఎస్ఎస్ రాజమౌళి ప్రపంచవ్యాప్తంగా పాపులర్ అయ్యాడు. దేశ సినీ చరిత్రలోనే గతంలో ఎన్నడూ లేని విధంగా సరికొత్త రికార్డులు సృష్టించిన చిత్రాన్ని సినీ ప్రేక్షకులు అందించారు. వినోదరంగంలో అత్యధికంగా సంపాదనను సొంతం చేసుకొన్నందు వ్యక్తిగా ఫోర్బ్స్ మ్యాగజైన్ పరిగణించింది. తాజాగా ప్రకటించిన 100 మంది జాబితాలో రాజమౌళికి 15వ స్థానం దక్కింది. ఈ సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లాలోని ఆయన బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు ప్రముఖ దినపత్రికతో తమ ఆనందాన్ని పంచుకొన్నారు. రాజమౌళి విద్యాభ్యాసం 1973లో కొవ్వూరులో జరిగింది. కొవ్వూరులోనే పుట్టిన జక్కన బాల్యం అక్కడే గడిచింది. కొవ్వూరుకు చెందిన ఆయన సినీ రంగంలో అగ్ర దర్శకుడిగా గుర్తింపు పొందడంపై గోదావరి జిల్లా వాసులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమ అభిప్రాయాలను పంచుకొన్నారు. రాజమౌళి మల్టీస్టారర్ బడ్జెట్ తెలిస్తే షాకే..! కొవ్వూరు పేరు తెచ్చిన జక్కన్న దర్శక ధీరుడు రాజమౌళి కొవ్వూరుకే పేరు తెచ్చిన వ్యక్తి. సినిమా రంగంలో ఎంతో మంది దర్శకులు ఉన్నా.. తన ప్రతిభతో బాహుబలి లాంటి చిత్రాన్ని రూపొందించి రాజమౌళి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. ఫోర్బ్స్ జాబితాలో పేరు జక్కన్నగా పేరు తెచ్చుకోవడం, మా ఊరు వాడు కావడం మాకు ఎంతో గర్వకారణం. నేటి యువతకు రాజమౌళి ఆదర్శంగా నిలుస్తాడు. ఆయన మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నాం అని పశ్చిమ గోదావరి జిల్లా వాసులు పేర్కొంటున్నారు. జక్కన్న గొప్ప వ్యక్తిగా వినోద రంగంలో అత్యధికంగా సంపాదించిన వ్యక్తిగా ఫోర్బ్స్ జాబితాలో రాజమౌళి పేరు ఉండటంపైపై కొవ్వూరు వాసులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఫోర్బ్స్ మ్యాగజైన్ జాబితాలో ఆయన 15వ స్థానంలో నిలవడం కొవ్వూరుకే గర్వకారణం. మా ప్రాంతంలో పుట్టి పెరిగిన జక్కన్నకు పేరు ప్రఖ్యాతులు రావడం గొప్ప విషయమని కొవ్వూరు వాసులు తమ ఆనందాన్ని ఇటీవల మీడియాతో పంచుకొన్నారు.

## ఉండటానికి ఇల్లు కూడా లేని స్థితిలో కమల్ హాసన్ మాజీ భార్య?

గతి లేని స్థితిలో టాప్ హీరో భార్య ! కమల్ హాసన్ మాజీ భార్య, నటి సారిక గురించి బాలీవుడ్ సర్కిల్ నుండి ఓ షాకింగ్ న్యూస్ వినిపిస్తోంది. ప్రస్తుతం ఆమె ఉండటానికి ఇల్లు కూడా లేని దీనమైన స్థితిలో ఉన్నారని, మాజీ భర్త కమల్ హాసన్, కూతుళ్లు శృతి హాసన్, అక్షర హాసన్ కూడా పట్టించుకోక పోవడంతో ఆమె పరిస్థితి గమనించిన అమీర్ ఖాన్ సహాయం అందించారనే వార్తలు వినిపిస్తున్నాయి. 2004లో కమల్ హాసన్‌తో విడిపోయిన తర్వాత నుండి సారిక ముంబైలోని తన పుట్టింట్లో ఉంటున్నారు. ఇటీవలే సారిక తల్లి చనిపోయింది. ఆమె మరణం తర్వాత సారికకు ఉండటానికి ఇల్లు కూడా లేకుండా పోయిందని తెలుస్తోంది. ఆస్తి అంతా అతడికే వెళ్లిపోయింది సారిక తల్లి తన వీలునామాలో.... ప్రస్తుతం ఆమె ఉంటున్న ఇంటితో పాటు ముంబైలోని మొత్తం ఆస్తులను వారి ఫ్యామిలీ ఫ్రెండ్ డాక్టర్ విక్రమ్ ఠాకూర్‌కు పేరున రాశారట. ఇంటిని అతడు స్వాధీనం చేసుకోవడంతో సారిక నిరాశ్రయురాలైనట్లు తెలుస్తోంది. సహాయం అందించిన అమీర్ ఖాన్ అమీర్ ఖాన్ సోదరికి సారిక బెస్ట్ ఫ్రెండ్. సారిక పరిస్థితి చూసి చలించిపోయిన అమీర్ ఖాన్... తన వంతు సహాయం చేశారని, ప్రస్తుతం ఆమె ఉండటానికి సహాయం చేసినట్లు తెలుస్తోంది. శృతి హాసన్, అక్షర హాసన్ సారిక తన భర్తతో 2004లో విడిపోయారు. పెద్ద కూతురు శృతి హాసన్ సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. ఆమెకు ముంబైలో సొంత ఫ్లాట్ కూడా ఉంది. ఇక చిన్న కూతురు అక్షర హాసన్ చెన్నైలో తన తండ్రి వద్ద ఉంటోంది. ఆ ముగ్గురూ పట్టించుకోలేదా? మాజీ భర్త కమల్ హాసన్... ఇద్దరు కూతుళ్లు శృతి హాసన్, అక్షర్ హాసన్ ఉండగా అమీర్ ఖాన్ సహాయంతో ఉండాల్సిన దుస్థితి ఏమిటి? వీరు ఆమెకు సహాయంగా నిలవలేదా? అనే సందేహాలు సినీ జనాల్లో వ్యక్తం అవుతున్నాయి.






## కొత్త క్లాతింగ్ బ్రాండ్‌తో
# దీపికా పదుకొణే

సినిమాలతో పాటు యాడ్ ఫీల్డ్‌లో కూడా రెండు చేతులా సంపాదిస్తున్నారు బాలీవుడ్ హీరోయిన్లు. ఈ జాబితాలో డస్కీబ్యూటీ దీపికా పదుకొనే మిగతా భామల కంటే ముందంజలో ఉంది. అయితే సినిమాలు, యాడ్ ఫిల్మ్స్‌తో పాటుగా తాజాగా ఆన్ లైన్ మార్కెట్ లో బిజినెస్ స్టార్ట్ చేసేందుకు రెడీ అయిందట దీపికా. ఇందుకోసం ఆన్ లైన్ ఫ్యాషన్ పోర్టల్ మైంత్ర ను సెలెక్ట్ చేసుకుందట. దీనిలో దీపికా సొంత బ్రాండ్ అయిన 'ఆల్ అబౌట్ యూ' దుస్తులను విక్రయించబోతున్నారని టాక్.

సినిమాల్లో మరో పక్క యాడ్ ఫీల్డ్ లో తనకు ఫుల్ పాపులారిటీ లభిస్తుండటంతో ఈ క్రేజ్‌ను తన ఆన్ లైన్ బిజినెస్ ద్వారా క్యాష్ చేసుకోడానికి దీపికా ప్రయత్నిస్తోంది. యితే అవి కేవలం ఆడవారికే ప్రత్యేకం. ఆమె చెప్పేది దేని గురించి అంటే....లేడీస్ ఫ్యాషన్ గురించే.

ఇప్పుడు ఈ అమ్మడు కూడా సొంత దుకాణం తెరిచింది. కానీ అది కేవలం ఆన్లైన్లో అవడం విశేషం. ఈమధ్య బాగా ఊపుమీదున్న ఆన్లైన్ సెగ్మెంట్ ని దీపిక బాగానే ఒంటపట్టించుకుంది. ఈ బ్రాండ్ పై మహిళల దుస్తులను మాత్రమే విక్రయిస్తారు. నేటి తరం మహిళామణులు కోరుకునే ఫ్యాషన్ కి అనుగుణంగా అన్ని రకాలు ఉంటాయని చెప్తోంది దీపిక. ఇందుకోసం ఆన్ లైన్ ఫ్యాషన్ పోర్టల్ మింత్ర ను సెలెక్ట్ చేసుకుంది. "ఆల్ అబౌట్ యు" అంటూ ఓ కొత్త క్లాతింగ్ బ్రాండ్ ను స్టార్ట్ చేసింది దీపికా పదుకొనే. ఈ కామర్స్ పోర్టల్ మింత్రా తో కలిసి ఈ బ్రాండ్ ను లాంఛ్ చేసిన దీపిక.. ఆ బ్రాండ్ డ్రెస్సులు వేసుకుని తెగ పోజులు ఇచ్చేసి.. ఫోటోలు దిగేసింది.

# క్రిస్మస్... కరుణామయుడు క్రీస్తు జన్మదినం






"క్రిస్మస్" క్రైస్తవులకు ముఖ్యమైన పండుగ. యేసుక్రీస్తు జన్మదిన సందర్భంగా జరుపుకునే ఈ పండుగ ఎంతో పవిత్రమైనది. యేసు జన్మించి ఇప్పటికి రెండు వేల సంవత్సరాలు దాటిపోయినా ఆయనను కరుణారస మూర్తిగా, దయామూర్తిగా నిత్యం ప్రార్థనలు చేస్తున్నారు భక్త జనులు.

ఆ కాలంలో అంటే రెండు వేల సంవత్సరాల కిందట రోమా సామ్రాజ్యాన్ని ఆగస్టస్ సీజర్ అనే చక్రవర్తి పరిపాలిస్తున్నాడు. ఆయన తన రాజ్యంలో ఎంత మంది ప్రజలు ఉన్నారో లెక్కవేయించాలనుకున్నాడు. అందుకు వీలుగా ప్రజలందరు ఎవరి స్వగ్రామాలకు వాళ్ళు డిసెంబరు 25 తేదీలోగా వెళ్ళాలని ఆజ్ఞాపించాడు.

అప్పుడు ' నజరేతు ' అనే పట్టణంలో మేరీ, జోసఫ్ అనే వాళ్ళు నివసిస్తున్నారు. మేరీకి జోసెఫ్‌తో పెళ్ళికుదిరింది. ఇదిలా ఉండగా ఒక రోజున మేరీకి గాబ్రియేల్ అనే దేవదూత కనబడి 'ఓ మేరీ! నీవు దేవుని వలన అనుగ్రహం పొందావు. నీవు కన్యగానే గర్భవతివి అవుతావు. నీవు ఒక కుమారుని కంటావు. అతనికి 'యేసు' అని పేరు పెట్టు. అతడు దేవుని కుమారుడు' అని చెప్పాడు. యేసు అంటే రక్షకుడు అని అర్థం. మేరీ గర్భవతి అయింది.

ఇది తెలిసి జోసెఫ్ ఆమెను పెండ్లాడరాదని, విడిచి పెట్టాలని ఆలోచించసాగాడు. అయితే ఒక రాత్రి కలలో అతనికి దేవదూత కనపడి' మేరీని నీవు విడనాడవద్దు. ఆమె భగవంతుని వరం వలన గరవేతి అయింది. ఆమెకు పుట్టే కొడుకు దేవుని కుమారుడు. తన్ను నమ్మిన ప్రజలందరిని వాళ్ళ పాపాల నుండి రక్షిస్తాడు.' అని చెప్పాడు. జోసఫ్ న్యాయవంతుడు భక్తుడు. కనుక మేరీని ప్రేమతో ఆదరించాడు. జోసఫ్ స్వగ్రామం బెత్లేహం. అందుచేత వాళ్ళు రాజాజ్ఞను అనుసరించి బెత్లేహేముకు బయలుదేరారు. తీరా వాళ్ళు బెత్లేహేము చేరుకునే సరికి వాళ్ళకక్కడ ఉండటానికి వసతి దొరకలేదు. చివరకు ఒక సత్రపు యజమాని తన పశువుల పాకలో ఉండనిచ్చాడు. అక్కడే మేరీ ఒక శిశువును ప్రసవించింది.ఆ రాత్రి ఆ ఊరికి ప్రక్కనున్న పొలాల్లో కొందరు పశువుల కాపరులు తమ గొర్రెల మందలను కాపలా కాస్తున్నారు. అప్పుడు ఒక దేవదూత ఆకాశం నుంచి వారి ముందుకు దిగి వచ్చాడు. ఆ దూత చుట్టూ ఉన్న వెలుగుకు గొర్రెలకాపరులు భయపడ్డారు. దేవదూత వాళ్ళతో, భయపడకండి. ఇదిగో మీకొక సంతోషకరమైన శుభవార్త. ఇవ్వాళ బెత్లెహేములోని ఒక పశువులపాకలో, లోక రక్షకుడు పుట్టాడు. ఆయనే అందరికీ ప్రభువు. ఒక పసికందు పొత్తిగుడ్డల్లో చుట్టబడి, పశువుల తొట్టిలో పండుకొని ఉంటాడు. ఇదే మీకు ఆనవాలు. అతడే లోకరక్షకుడు అని చెప్పాడు. దేవదూత ఇలా చెబుతుండగా పొలమంతా ఆకాశం నుండి దిగివచ్చిన దేవదూతలతో నిండిపోయింది. వాళ్ళంతా దేవునికి స్తుతి గీతాలు పాడి మాయమైనారు. గొర్రెల కాపరులు హుటాహుటిన వెళ్ళి దేవదూత చెప్పిన పశువుల పాకను చేరుకున్నారు. అక్కడ పశువుల తొట్టిలో పడుకొని ఉన్న శిశువును, మేరీ, జోసెఫ్ లను చూశారు. వారు తాము చూచింది, దేవదూత తమకు చెప్పింది అందరికి తెలియజేశారు. అలా రెండు వేల సంవత్సరాల క్రిందట డిసెంబరు 24వ తేదీ అర్ధరాత్రి యేసు క్రీస్తు జన్మించాడు. అందుచేత ఆ మరునాడు అంటే డిసెంబరు 25వ తేదీ క్రిస్మస్ పండుగ.

# సంచలనం సృష్టించడానికే కోహ్లి వస్తున్నాడు



న్యూఢిల్లీ : విరాట్ కోహ్లి నేతృత్వంలో వరుస విజయాలతో దూసుకెళ్తోన్న భారత జట్టు వచ్చే ఏడాది ఆరంభంలో దక్షిణాఫ్రికాలో పర్యటించనుంది. కోహ్లి సారథ్యంలోని టీమిండియా వరుసగా 9 సిరీస్‌లను నెగ్గింది. కానీ సఫారీ గడ్డ మీద భారత్‌కు అసలు సిసలు సవాల్ ఎదురు కానుందని మాజీలు అంచనా వేస్తున్నారు. ఇప్పటి దాకా సొంత గడ్డ మీద తలపడిన కోహ్లిసేనకు..

తొలిసారిగా సౌతాఫ్రికా పర్యటన రూపంలో కఠిన పరీక్షకు ఎదురు కానుంది. కాగా ఈ విషయంలో సఫారీ బ్యాట్స్‌మెన్ ఏబీ డివిలియర్స్ మరోలా స్పందించాడు.

సంచలనం సృష్టించడానికే విరాట్ కోహ్లి దక్షిణాఫ్రికా వస్తున్నాడని డివిలియర్స్ తెలిపాడు. కోహ్లి ఎంతటి అంకితభావం ఉన్న కెప్టెనో మనకు తెలుసు. అతడు సౌతాఫ్రికాలో కచ్చితంగా చరిత్ర సృష్టించేందుకు ప్రయత్నిస్తాడని ఏబీ చెప్పాడు. మాకు ఆ విషయం తెలుసు.

అందుకే కోహ్లి సేనను ఎదుర్కోవడానికి సన్నద్ధమయ్యాం అని డివిలియర్స్ చెప్పుకొచ్చాడు. భారత్ యువరక్తంతో ఉరకలేస్తోంది. గతంతో పోలిస్తే.. ఇటీవల మా దేశంలో వారు మెరుగ్గా రాణిస్తున్నారని ఏబీ చెప్పాడు.

సొంత గడ్డ మీద భారత్‌పై గెలవడం ద్వారా టెస్టుల్లో అగ్రస్థానం చేజిక్కించుకోవడానికి ప్రయత్నిస్తామని డివిలియర్స్ చెప్పాడు. కాగా భారత్‌తో సిరీస్‌ను దృష్టిలో ఉంచుకొని డివిలియర్స్, డేల్ స్టెయిన్‌లకు రెండేళ్ల తర్వాత టెస్టుల్లోకి దక్షిణాఫ్రికా పిలుపునిచ్చింది. జింబాబ్వేతో పింక్ బాల్‌తో జరగనున్న నాలుగు రోజుల టెస్టులో వీరిద్దరికీ చోటు లభించింది.

# తెన్నేటి పార్కులో
## గీతం ఎన్ఎస్ఎస్ స్వచ్ఛభారత్

**80 మందికి పైగా పాల్గొన్న విద్యార్థులు**

**మొక్కలు, పాదులు సరిచేసి నీటి సరఫరా**

**గీతం అధ్యాపక సిబ్బంది**




సాగర్‌నగర్‌: స్థానిక కైలాసగిరి సమీపంలోని తెన్నేటిపార్కులో గీతం విశ్వ విద్యాలయం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) మరియు గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంటు విభాగం వలంటీర్ల ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

దాదాపు 80 మందికి పైగా విద్యార్థులు ఆదివారం ఈ కార్యక్రమంలో పాల్గొని తెన్నేటిపార్కు పరిసరాలను శుభ్రం చేశారు. బీచ్ లోని వ్యర్థాలను మరయు పార్కులో వ్యర్థాలను తొలగించి మొక్కలకు నీరు అందే విధంగా పాదులు సరి చేయడంతో పాటు సందర్శకులకు పరిశుభ్రత పాటించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. తెన్నేటి పార్కును గీతం విశ్వవిద్యాలయం దత్తత స్వీకరించిన నేపథ్యంలో గత ఏడాది నుంచి క్రమం తప్పక స్వచ్ఛభారత్‌ను నిర్వహిస్తున్నామని, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు స్ఫూర్తిదాయకంగా ఇందులో పాల్గొంటున్నారని గీతం విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎమ్.పోతరాజు అభినందించారు.

కార్యక్రమంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంటు ప్రిన్సిపాల్ ఫ్రొఫెసర్ పి.షిలా విద్యార్థి వ్యవహారాల విభాగం డైరక్టర్ ప్రొఫెసర్ కె.వీరభద్రం, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ జి.వి.స్వామి, ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ డాక్టర్.సంసుద్దీన్ ,తదితరులు పాల్గొన్నారు.

## జడేజా, అశ్విన్‌లు
# ఇక టెస్టులకేనా..?




న్యూఢిల్లీ : సీనియర్ స్పిన్నర్లు రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్‌లు ఇక టెస్టు మ్యాచ్‌లకే పరిమితంకానున్నారా..? అంటే అవుననేలా ఉన్నాయి భారత సెలక్టర్ల నిర్ణయాలు. గత కొద్ది సిరీస్‌ల్గా వన్డే, టీ20 జట్టులో స్థానం కోల్పోతున్న ఈ స్పిన్ ద్వయానికి శనివారం రాత్రి కూడా సెలక్టర్లు మొండిచేయి చూపారు. దక్షిణాఫ్రికా పర్యటనలో భాగంగా ఫిబ్రవరి 1 నుంచి భారత్ జట్టు ఆరు వన్డేల సిరీస్ ఆడనుంది. ఈ సిరీస్ కోసం 17 మంది సభ్యులతో కూడిన జట్టుని శనివారం రాత్రి సెలక్టర్లు ప్రకటించారు. కానీ.. ఇందులో అశ్విన్, జడేజా చోటు దక్కలేదు.

గత కొద్దినెలలుగా మణికట్టు స్పిన్నర్లు చాహల్, కుల్దీప్ యాదవ్‌లు వన్డే, టీ20 జట్టులో మెరుగ్గా రాణిస్తుండటంతో సెలక్టర్లు మరోసారి వారిపై నమ్మకం ఉంచారు. అశ్విన్, జడేజ్లాను పక్కన పెట్టడంపై చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ మాట్లాడుతూ యువ స్పిన్నర్లతో ప్రస్తుతం జట్టులో ప్రయోగాలు చేస్తున్నాం. వారు కూడా తమకి దొరికిన అవకాశాల్ని చక్కగా సద్వినియోగం చేసుకుని మ్యాచ్‌ల్ని గెలిపిస్తున్నారు. అందుకే వారిని మరికొంతకాలం జట్టుతో కొనసాగించాలని నిర్ణయించాం అని వివరించారు. దక్షిణాఫ్రికాతో జనవరి 5 నుంచి జరగనున్న టెస్టు సిరీస్ కోసం ఎంపిక చేసిన జట్టులో అశ్విన్, జడేజాలకి చోటు దక్కిన విషయం తెలిసిందే.



# ఘనంగా ప్రారంభమైన కెఎల్ఎం షాపింగ్ మాల్

**జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించిన సినీ తారలు**

విశాఖపట్నంః కెఎల్ఎం ఫ్యాషింగ్ మాల్ చాలా బాగుందని, హైదారాబాద్‌లో బ్రాంచి కూడా తానే ప్రారంభించినట్లు తెలుగు సినీ హీరోయిన్ కెథారిన్ పేర్కొన్నారు. ఆదివారం జగదాంబ జంక్షన్ దగ్గర గల కెఎల్ఎం షాపింగ్ మాల్‌ను ముగ్గురు సినీతారలు షాలినీ పాండే, కేథారిన్ త్రిషా, మెహరిన్ ప్రారంభించారు. ముగ్గురు ముద్దుగుమ్మలు సందడి చేస్తూ ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య హల్‌చల్ చేశారు. ఇది మిడిల్ క్లాస్ ప్రజలకు చాలా ఉపయోగపడుతుందని, ఇక్కడ రంగురంగు వస్త్రాలు సామాన్య మానవునికి కూడా అందుబాటులో ఉండే విధంగా ఉంటాయని పేర్కొన్నారు. మెహరిన్ మాట్లాడుతూ అన్ని వర్గాల వస్త్ర ప్రియులను ఆకర్షించే విధంగా ఉన్నాయని, చిన్న పిల్లల వద్ద నుంచి పెద్ద వారి వరకు అందరినీ ఆకర్షించే విధంగా ఉన్నాయన్నారు. షాలినీ మాట్లాడుతూ విశాఖ అంటే తనకెంతో ఇష్టమని అంటూ వస్త్రప్రియులకు అభివాదాలు చేశారు.

మాల్ అదినేత కల్యాణ్ మాట్లాడుతూ అంతర్జాతీయంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ ప్రజలకు అందుబాటులో వస్త్రాలు ఉన్నాయని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీనికి ముఖ్య అతిథులుగా సీఎంఆర్, ఎంవిఆర్ గ్రూప్ మావూరి వెంకట రమణ, కంకటాల సిల్క్స్ చైర్మన్ కంకటాల మల్లిక్‌తదితరులు పాల్గొన్నారు.










VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com